జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 5 సంచిక 322 | హైదరాబాద్, సెప్టెంబరు 13 మంగళవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

# వ్యవసాయం, విద్యుత్ రంగాలపైనే కేంద్రం కన్ను

## యూపీ ప్లస్ బిహార్, గయా మోదీ నినాదం..
## బీజేపీని పడగొట్టేందుకు స్కెచ్ వేసిన వ్యూహం:కేసీఆర్



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: ప్రస్తుతం వ్యవసాయం, విద్యుత్ రంగాలపైనే కేంద్రం కన్నువేసిందని సీఎం కేసీఆర్ ధ్వజమెత్తారు. శాసనసభలో విద్యుత్ సంస్కరణలపై లఘు చర్చ జరిగింది. కేంద్రం విధానాలపై కేసీఆర్ మండిపడ్డారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. 'ఇప్పటికే ఓడరేవులు, విమానాలు, అన్నీ పాయే.. రైలుపాయే.. రైలు స్టేషన్లు పాయే.. అన్నింటికి అన్నిపోతున్నయ్. ఇప్పుడు దీనికి సూటిపెట్టారు. ఇక రెండు మిగిలాయ్. ఒకటి వ్యవసాయరంగం. రెండోది విద్యుత్ రంగం. ఈ రెండు సావుకార్లకు అప్పజెప్పే వరకు మేం నిద్రపోం.. ఇది కేంద్ర ప్రభుత్వం శపథం. ఈ దీనికి అందమైన ముసుగుపేరు సంస్కరణ. చూడడానికి అందంగానే కనిపిస్తది. రైతులు ఎక్కడైనా అమ్ముకోవచ్చని చెబుతరు.రైతులు లాభం ఉన్నకాడ అమ్ముకోవచ్చని చెబుతరు.. బాన్సువాడ రైతులు ధాన్యం తీసుకుపోయి పంజాబ్‌లో అమ్ముతారా? అయ్యేపనేనా? గిట్టుబాటు అయ్యేవనేనా? చెప్పడానికి ఎక్కడ అమ్ముకోవచ్చు కాదా.. మంచిది కదా? ఫ్రీ మార్కెట్? దుబ్బాక వాళ్లు వచ్చి సిద్ధిపేటలో అమ్మే పరిస్థితి ఉండదు. రవాణా చార్జీలకే పోతే.. వీళ్లు పెంచిన పెట్రోల్, డీజిల్ రేట్లతో. వ్యవసాయ చేయలేకుంటనే అవుతున్నది. ఎకరం దున్నాలంటే గతంలో ఎంతుంటే.. ఇప్పుడు ఎంత అవుతున్నది. వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టి ఎక్కడైనా అమ్ముకోవచ్చు అన్న మాట దగా. మోసం.. దాని పేరు మీద ఉన్న సిస్టమ్‌ను ధ్వంసం చేస్తున్నరు. దీనిపై వెనుక కుట్రను త్వరలో మళ్లీ వివరంగా చెబుతా'నన్నారు.

**యూపీ ప్లస్ బిహార్, గయా మోదీ నినాదం.. బీజేపీని పడగొట్టేందుకు స్కెచ్ వేసిన వ్యూహం**

సీఎం కేసీఆర్ జాతీయ పార్టీ ప్రకటించనున్న నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో సమీకరణలు మారుతున్నాయి. కేంద్రంలోని బీజేపీని పడగొట్టేందుకు మెయిన్? ఫ్రంట్? వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటికే బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌తో **(మిగతా 2లో..)**

# అమ్మ అడుగుజాడల్లో నడుస్తా..

## బ్రిటన్ పార్లమెంట్‌లో రాజు చార్లెస్–3 తొలి ప్రసంగం

లండన్ : బ్రిటన్ రాజుగా చార్లెస్–3 మొదటిసారిగా పార్లమెంట్‌లో సోమవారం ప్రసంగించారు. నిస్వార్థపు సేవకు నిలువెత్తు రూపం తన తల్లి ఎలిజబెత్–2 అని, ఆమె అడుగుజాడల్లోనే తానూ నడుస్తానని ఆయన ప్రతిన చేశారు. ఎంతో విలువైన, రాజ్యాంగబద్ధమైన పాలనా సూత్రాలను పరిరక్షిస్తానని హామీ ఇచ్చారు. మన ప్రజాస్వామ్యానికి సజీవమైన సాక్ష్యం, పార్లమెంట్ అనిఆయన అభివర్ణించారు. కొత్త రాజుకుతాము విధేయంగా వుంటామని పార్లమెంట్ సభ్యులందరూ ప్రతిన చేశారు. ఆ తర్వాత స్పీకర్ సర్ లిండ్సే హోయలే సంతాప సందేశాన్ని చదివి వినిపించారు. తర్వాత దాన్ని రాజుకు అందచేశారు. సంతాప



సమావేశం అనంతరం రాజు చార్లెస్ దంపతులు ఎడిన్‌బరో నుండి రాణి ఎలిజబెత్ అంతిమయాత్రలో పాల్గనేందుకువెళ్లారు. స్కాటిష్ రాజధానిలో సెయింట్ గిల్స్ కేథడ్రల్‌లో ప్రజల సందర్శనార్థం ఆమె భౌతిక కాయాన్ని 24గంటలు వుంచుతారు. ఆ తర్వాత ఇంగ్లండ్‌కు విమానంలో తీసుకువస్తారు. 14వ తేదీన వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్‌కు తీసుకువెళతారు.

# టి20 ప్రపంచకప్‌కు జట్టును ప్రకటించిన బిసిసిఐ



ముంబయి,ప్రజాపాలన ప్రతినిధి: అక్టోబర్‌లో ఆస్ట్రేలియా వేదికగా జరిగే టి20 ప్రపంచకప్‌లో ఆడే భారత జట్టును భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) సోమవారం ప్రకటించింది. 15మంది ఆటగాళ్ల బృందానికి రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆసియాకప్ టోర్నీకి గాయాల కారణంగా దూరంగా ఉన్న జస్ప్రీత్ బుమ్రా, హర్షల్ పటేల్ తిరిగి భారతజట్టులో చోటు దక్కించుకోగా.. అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్న వికెట్ కీపర్ సంజు శాంసన్‌కు బిసిసిఐ మరోసారి మొండిచెయ్యి చూపింది. టి20ల్లో వరుసగా విఫలం అవుతున్న రిషభ్ పంత్‌వైపే సెలెక్టర్లు మొగ్గుచూపారు. అలాగే భారత పర్యటనకు ఈనెలలో రానున్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో జరిగే టి20 సిరీస్‌లో కూడా దాదాపు ఇదే జట్టు ఆడనుంది. ఆసీస్ సిరీస్‌కు అర్షదీప్ సింగ్ దూరమవ్వగా.. సఫారీలతో సిరీస్‌కు హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ దూరమయ్యారు. వీళ్లు ముగ్గురు ఈ సిరీస్‌లో జరిగే సమయంలో కండిషనింగ్ కోసం బెంగళూరులోని శిక్షణా శిబిరంకు వెళ్లనున్నట్లు బిసిసిఐ ప్రకటించింది.

జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, దీపక్ హుడా, రిషభ్ పంత్, దినేష్ కార్తీక్, హార్దిక్ పాండ్యా, రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్, హర్షల్ పటేల్, అర్షదీప్ సింగ్

స్టాండ్‌బై ఆటగాళ్లు: మహమ్మద్ షమీ, శ్రేయాస్ అయ్యర్, రవి బిష్ణోయి, దీపక్ చాహర్



## కొత్త చట్టాన్ని ప్రజలపై రుద్దడమేంటి?

హైదరాబాద్ :కేంద్రం తెచ్చిన విద్యుత్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టంపై తమ పార్టీకి అభ్యంతరాలు ఉన్నాయన్నారు. దానిపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా భట్టి మాట్లాడారు.కేంద్రం చట్టం తెచ్చి రాష్ట్రాలు అమలు చేయాల్సిందే అనడం సరికాదని భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలో ఉన్న సమస్యలను పక్కకు పెట్టి.. కొత్త చట్టాలను ప్రజలపై బలవంతంగా రుద్దడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కేంద్రం జాతి సంపదను అమ్ముకుంటూ వస్తోందని భట్టి ఆరోపించారు.

# హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఫార్మా కంపెనీ..

## డీఎఫ్ ఈ ఫార్మాని ప్రారంభించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్: అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం డీఎఫ్‌ఈ ఫార్మాకు చెందిన కొత్త కేంద్రాన్ని మంత్రి కేటీఆర్ సోమవారం ప్రారంభించారు. నగరంలోని జీనోమ్ వ్యాలీలో ఏర్పాటైన ఈ సెంటర్‌తో ఫార్మా సంస్థలకు లెక్కలేనన్ని ప్రయోజనాలు దక్కనున్నాయి. ఫార్మా రంగంలో సిటీకి చెందిన పలు కంపెనీలు ఫస్ట్ టైమ్ రైట్ ఔషధాలను ఉత్పత్తి చేయడం, వాటిపై పేటెంట్లు పొందడం వంటి విషయాల్లో డీఎఫ్‌ఈ ఫార్మా నూతన కేంద్రం తోడ్పాటును అందించనుంది.క్లోజర్ టూ ద ఫార్ములేషన్ ప్రాతిపాదికగా ఈ కేంద్రం పని చేయనుంది. తెలంగాణలో తన కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా ఈమధ్య మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలో డీఎఫ్‌ఈ ఫార్మా ఒప్పందం కుదుర్చుకుంది.


# పబ్స్‌కు హైకోర్టు వార్నింగ్..

## రాత్రి 10 దాటితే సౌండ్ బంద్‌జేయాలని ఆర్డర్స్



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: హైదరాబాద్‌లో పబ్ కల్చర్ పెరుగుతోంది. అర్ధరాత్రి దాకా తాగుతూ, విపరీతమైన లౌడ్ స్పీకర్ల సౌండ్స్ మధ్య డ్యాన్సులు చేస్తుంటారు. అయితే.. ఇది వారికి ఎంజాయ్ మెంట్ అనిపించినా.. మిగతా వారికి అసహ్యంగా ఉంటోంది. విపరీతమైన సౌండ్స్‌తో వాహనదారులు, చుట్టుపక్కల వారు ఇబ్బందికి గురవుతున్నారు. దీంతో హైకోర్టు ఇవ్వాల పబ్‌ల తీరుపై మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. రాత్రివేళ ఎట్లాంటి సౌండ్ సిస్టమ్స్‌కి అనుమతి లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఎక్సైజ్ రూల్స్ ప్రకారం ఇళ్లు, విద్యాసంస్థలు ఉన్న ప్రదేశాల్లో పబ్‌లకు ఎలా అనుమతిస్తారని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది.అందులో భాగంగా.. ఇవ్వాల్టి రాత్రి 10 గంటల నుంచి పబ్స్‌లో ఎట్లాంటి సౌండ్స్ రావొద్దని ఆదేశాలు జారీ చేసింది హైకోర్టు. సిటీ పోలీస్ యాక్ట్, నాయిస్ పొల్యూషన్ రెగ్యులేషన్స్ ప్రకారం ఈ నిబంధనలు పాటించాలని ఆర్డర్స్ ఇచ్చింది.

## ఆరెస్సెస్, వీహెచ్‌పీ పుట్టక ముందు హిందువులు లేరా..? : భూపేష్ బఘేల్



న్యూఢిల్లీ : చత్తీస్‌ఘడ్ సీఎం భూపేష్ బఘేల్ సోమవారం ఆరెస్సెస్‌పై విరుచుకుపడ్డారు. మహాత్మ గాంధీని పొట్టనపెట్టుకున్నది ఈ సంస్థేనని మండిపడ్డారు. ఆరెస్సెస్ హిందుత్వ అసలు ఎక్కడి నుంచి వచ్చిందని నిలదీశారు. వారు (ఆరెస్సెస్) ఏ దేవుడు, దేవతను ఆరాధిస్తారు, అనుసరిస్తారని ప్రశ్నించారు. ఈ సంస్థలు పుట్టుకొచ్చి కనీసం వందేండ్లు కూడా కాలేదని ఆరెస్సెస్, వీహెచ్‌పీలు 1925లో ఏర్పాటయ్యాయని, అంతకుముందు హిందువులు లేరా అని ప్రశ్నించారు. బీజేపీ సైద్ధాంతిక సంస్థ ఆరెస్సెస్‌పై విమర్శలు గుప్పిస్తూ హింస, గూండాగిరీ మన సంస్కృతి కాదని అన్నారు.వీరు మనుషులను జంతువుల కంటే హీనంగా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ విద్వేషంతో ప్రజలతో మమేకం కావాలని కోరుకుంటోందని ఆరెస్సెస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి మన్మోహన్ వైద్య ఆరోపించారు. కాగా, గతంలో ఆరెస్సెస్ యూనిఫాం ఖాకీ నిక్కర్లు దగ్ధమవుతున్న ఫోటోను అంతకుముందు కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో షేర్ చేయడంతో ఇరు పార్టీల మధ్య డైలాగ్ వార్ ముదిరింది.

## పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయి కమిటీలు



హైదరాబాద్: పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయి కమిటీలు పోడు భూముల కోసం జిల్లా స్థాయిలో కోఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలని ట్రైబల్ వెల్‌ఫేర్ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ కమిటీలకు జిల్లా ఇంచార్జి మినిస్టర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. పోలీస్ కమిషనర్ లేదా ఎస్పీ, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ ), అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ డీఆర్‌డీవో, డీటీడీవో ఈ కమిటీలో అధికారిక సభ్యులుగా ఉంటారు.ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు ఇతరులను కూడా అవసరం మేరకు ఆహ్వానించే అధికారం ఈ కమిటీలకు ఉంటుంది. జిల్లా, మండలం, గ్రామపంచాయతీ స్థాయిలో అడవులను సంరక్షించేందుకు ఈ కమిటీ కృషి చేస్తుంది. పోడు భూముల కింద రిజిస్టర్ అయిన భుముల వివరాలను పరిశీలిస్తుంది. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా చర్యలు చేపడతారు.



## పోలీసు పరీక్షల్లో బడుగులకు అన్యాయం



మధిర టౌన్ సెప్టెంబర్ 12 రాష్ట్ర పోలీసు నియామక మండలి నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో బీసీ,ఎస్సీ,ఎస్టీలకు అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వైయస్సార్ తెలంగాణ పార్టీ దళిత విభాగం జిల్లా అధ్యక్షులు రిటైర్డు సిఐ డాక్టర్ మద్దెల ప్రసాద రావు పేర్కొన్నారు. సోమవారం మధిర లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఈ మధ్య కాలంలో నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని ఆయన ఆరోపించారు. గతంలో 2014 మరియు 2018లో ఇచ్చిన నోటిఫికేషన్లలో ఓసీ అభ్యర్థులకి 80,బీసీలకు 70,ఎస్సీ ఎస్టీలకు 60 మార్కులను కటాఫ్ మార్కులుగా పెట్టడం జరిగిందన్నారు. నూతనంగా ఇచ్చిన 2022 నోటిఫికేషన్లో ఓసి అభ్యర్థులకు కటాప్ మార్కులు 80 మార్కుల నుండి 60 మార్కులకు తగ్గించడం జరిగిందన్నారు. కానీ ఎస్సీ, ఎస్టీ,బీసీల అభ్యర్థుల కటాఫ్ మార్కులను మాత్రం తగ్గించకుండా యధావిధిగా ఉంచడం వల్ల ఆయా సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు రిజర్వేషన్లు తీవ్రంగా నష్టపోనున్నారని ఆయన వివరించారు.ఓసీలకు 20 మార్కులు తగ్గించినప్పుడు ఎస్సీ,ఎస్టీ,బీసీలకు 20 మార్కులు ఎందుకు తగ్గించలేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రమైన రిజర్వేషన్ రూల్కు వ్యతిరేకంగా రిక్రూట్మెంట్ బోర్డు తీసుకున్న తప్పుడు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోని కొత్త జీవో జారీ చేసి ఎస్సీ,ఎస్టీలకు 40, బీసీలకు 50,ఓసీలకు 60 మార్కులుగా క్వాలిఫైయింగ్ మార్క్స్ పెట్టి ఫలితాలు విడుదల చేయాలని కోరారు. అదే విధంగా ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలో దాదాపు 22 ప్రశ్నలు తప్పులుగా రావడం,కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలో 23 ప్రశ్నలు తప్పులుగా రావడం బోర్డు తప్పిదమని, తప్పుగా ఇచ్చిన ప్రశ్నలకు ప్రతి అభ్యర్థులకు మార్కులు కలపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా నెగటివ్ మార్కులు వల్ల కూడా అభ్యర్థులకు నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆలోచించి ఎస్సీ, ఎస్టీ బీసీ అభ్యర్థులకు న్యాయం చేయాలని మద్దెల ప్రసాదరావు కోరారు.

# వ్యవసాయం, విద్యుత్ రంగాలపైనే కేంద్రం కన్ను

(మొదటి పేజీ తరువాయి)

పాటు పలువురు లీడర్లతో సీఎం కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ క్రమంలో నిన్న కర్నాటక మాజీ సీఎం కుమారస్వామి కూడా తెలంగాణకు వచ్చి సీఎం కేసీఆర్తో జాతీయ రాజకీయాలు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కూలంకశంగా చర్చించారు. ఆ తదుపరి సీఎం కేసీఆర్ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమని ప్రకటించారు.కాగా, ఇప్పుడు "యూపీ ప్లస్ బీహార్ గయీ మోదీ" నినాదం ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సాగుతోంది. ఈ నినాదం బీహార్?, ఉత్తరప్రదేశ్? రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. ఇక.. ములాయం, అఖిలేష్?తో నితీశ్?కుమార్ టచ్?లో ఉన్నట్టు తేజస్వీ ఇవ్వాల చేసిన ప్రకటన ఇంకాస్త హీట్?ని పెంచింది. కేంద్రంలో బీజేపీని పడగొట్టేందుకు మెయిన్? ఫ్రంట్? కొత్త వ్యూహం పన్నుతున్నట్టు స్పష్టమవుతోంది.

**అసలు సంగతి కరెంటు బిల్లులు పెరగాలే.. మీటర్లు పెట్టాలే..**

'అసలు సంగతి ఎరువులు, డీజిల్ ధరలు, కోసే ధరలు పెరగాలే. కరెంటు బిల్లు పెరగాలే.. మీటర్లు పెట్టాలే.. చివరకు రైతు వ్యవసాయం తట్టా, పారా కింద పెట్టాలే.. పెడితే సావుకార్లు సూట్కేసులు పట్టుకొని దిగుతరు. మీతోని కాదు కార్పేరేట్ కంపెనీలు మేం సిద్ధంగా ఉన్నం. మొత్తం కేంద్ర ప్రభుత్వం ఆశీస్సులున్నయ్ మాకు వచ్చినం ఇగ. మీరు జరుగుర్రి పక్కకు.. మాకు కంపెనీలకు అప్పజెప్పుర్రి.. ఇండ్లనే కూలీకి పెని చేయండి.. ఇది ఇటు.. అటు ఆహార సబ్సిడీలు ఖతం పట్టించి రకరకాల పేరు మీద దాన్ని ఖతం చేస్తున్నది. చాలా బాధకరం. పరిణామ క్రమం ప్రజలకు తెలియజేయాలి.ఎమ్మెల్యేలందరం, మంత్రులందరం ఢిల్లీలో ఆందోళన చేస్తే మాపై జోక్ చేస్తరు. ధాన్యం కొనాలంటే.. మెడకు పెడితే కాలుకు.. కాలుకు పెడితే మెడకు పెట్టారు. ఇక్కడి నుంచి ఓ కేంద్రమంత్రి ఉన్నడు.. ఆయనేం మాట్లాడతుడో దేవుడికే ఎరుక.. ఆ పార్టీ నాయకులేమో వరి వేయండి.. కొనిపిచ్చే బాధ్యత మాది అన్నరు. మంచోచెడ్డో రైతులు పంట వేశారు.. ఎవరూ పత్తాలేకుంట పోయారు. చెప్పినోడు పారిపోతే.. ఇక్కడున్న పార్లమెంట్ సభ్యులు నిష్క్రియా పరులైతే టీఆర్ఎస్, ఇతర పార్టీలు అక్కడ కోట్లాడితే కనీసం సంఘీంభావం తెలువకపోతే చివరకు.. గవర్నమెంట్కు గర్నమెంట్ అంతా పోయి ఢిల్లీలో ధర్నా చేశాం' అని కేసీఆర్ గుర్తు చేశారు.

**కేంద్రమంత్రి అవహేళనగా చేసిండు..**

'ఆ సందర్భంలో జగదీశ్రెడ్డి, నిరంజన్రెడ్డితోపాటు మంత్రులు పోయి సంబంధిత మంత్రి పీయుష్గోయల్ను కలిస్తే.. తెలంగాణ చమత్కారం చేసిందా? క్యా జాదూ కరే అంటూ అవహేళన చేసినట్లు మాట్లాడారు. మీరు, మీ మనుషులు వచ్చి హెలికాప్టర్ వేసుకొని తిరుగుతు అని చెప్పాం. అబద్ధాలు చెబుతామా? పంట పొలం అగ్గిపెట్టెలో దాచిపెట్టేదా? వేల ఎకరాలకు కండ్లకు కనిపిస్తుంది కదా? ధాన్యం కొనమంటే మాకు స్థలం లేదు. ఎక్కడ పెట్టమంటారు అన్నరు. నూకలు అవుతయ్.. యాసంగిలో కొనాలంటే.. మీ తెలంగాణకు నూకలు తినిపించడం అలవాటు చేయాలని అవమానిస్తారా? వాళ ఫలితం ఏంటంటే.. ఇవాళ ఏం జరుగుతుంది. కేంద్రంలోని మంత్రులు, ప్రధానమంత్రి అవివేకం, అసమర్థతవల్ల దేశమే ఫుడ్ సెక్టార్లో ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చింది. కేంద్రానికి ముందుచూపు ఏమైనా ఉందా? నాలుగైదు నెలల కింద మేం ధర్నా చేసే దుస్థితి. ఇవాళ నూకల ఎగుమతి బ్యాన్ చేసే పరిస్థితి. రైతులకు ధర రాకుండా అడ్డుకున్నదే తెలివి తక్కువ, అవివేక కేంద్ర ప్రభుత్వం. రైతుల నోట్లో మళ్లీ మన్నుపడుతున్నది. ఎఫ్సీఐ కొనకున్నా మార్కెట్ ఫ్రీ చేస్తే.. యూరప్, అమెరికాలో కరువు ఉన్నది ఉక్రెయిన్ యుద్ధం కారణంగా.. రకరకాల ఇబ్బందులున్నయ్. ఇవాళ డిమాండ్ వస్తున్నది. మళ్లీ ఇవాళ ఇదే రైతులను కేంద్రం దెబ్బకొడుతూ నోట్లో మన్నుకొడుతున్నది. అడ్డం తగులుతూ నూకల ఎగుమతిని బ్యాన్ చేసింది. 20శాతం ఎగుమతిపై ఎక్సైజ్ డ్యూటీ పెంచారు' అని మండిపడ్డారు.

**అసమర్థ విధానాలతో దుర్మార్గమైన ఫలితాలు..**

అసమర్థ విధానాలు, దూరదృష్టి లేక, ఇతరులు చెబితే వినే లౌక్యం లేకపోవడంతో, సహనం కోల్పోయి అహంకార పూరితంగా వ్యవహరిస్తూ దుర్మార్గమైన ఫలితాలు తెస్తున్నరు.. ఇవి నిజాలు కావా? దీనిపై ఎక్కడైనా చర్చకు రెడీ. ఇలా ఎన్నో రంగాలను నాశనం పట్టిస్తున్నరు. ఇది ప్రజాస్వామ్యం.. ఇది ఉండకూడదట. భారతీయ జనతా పార్టీకి చెందిన వివిధ రాష్ట్రాల మంత్రులు, దురదృష్టవశాత్తు కొందరు ముఖ్యమంత్రులు ఎన్కౌంటర్లు చేస్తం అంటున్నరు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తది. జాతీయ జెండా ఎగురవేయకండి.. మీ ఇండ్ల మీద వేరే జెండా ఎగురవేయండి. జాతీయ జెండానే మార్చేస్తాం.. ఇదేనా దేశం వినాలా? ఇది మహాత్ముడు పుట్టిన గడ్డనేనా? ఈ మరుగుజ్జులు మాటలు వినాల్సిన ఖర్మనా మనది. ఎక్కడి నుంచి దాపురించారు ఈ దరిద్రులు.. మరుగుజ్జులు. దీని కోసమేనా అంబేద్కర్ రాజ్యాంగం రాసింది, ఇదేనా స్ఫూర్తి.మహాత్ముడు పుట్టిన నేలపై ఈ మరుగుజ్జులు చంపేస్తాం.. కోసేస్తాం.. పార్టీనే ఉంచం.. ఈ దేశంలో ఒక పార్టీనే ఉంటది. డిక్లేర్ చేయండి మంచిదే కదా? బ్యాన్ చేయండి అన్ని పార్టీలను అర్జెంట్గా. మీ సంగతే.. మా సంగతో తెలుతుంది దేశంలో. వేరే పార్టీలను ఏవీ ఉంచం.. ఉండకుండా చేస్తామని నిస్సిగ్గుగా కేంద్ర హోంమంత్రి మాట్లాడుతున్నడు.

కేంద్ర హోంమంత్రి మనుగోడు బహిరంగ సభలో ఓపెన్ స్టేట్ ఇచ్చాడు. దీనిపై పలు ప్రాంతాల నుంచి ఫోన్లు చేసి.. కేంద్ర హోం మంత్రి ఏం మాట్లాడుతున్నడని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి నోటి నుంచి ఇంత అప్రజాస్వామికమైన మాటను ఈ దేశం నుంచి భరించవచ్చునా? ఇది ధర్మమేనా.. భారతదేశాన్ని నడిపించే పెద్దలు మాట్లాడే మాటలేనా? అహింసతో దేశాన్ని తీసుకువచ్చిన మహాత్ముడు పుట్టిన నేల ఇది. ఎవరికి కిరీటం పెట్టడానికి? ఎవరిని కాపాడడానికి ఈ అరుపులు, పెడబొబ్బలు. ఈ పార్టీకి (బీజేపీకి) రెండుసార్లు 50శాతం ఓట్లు రాలేవు' అన్నారు.

# గులాబీ వర్సెస్ కమలం.. రోజుకో వివాదం

హైదరాబాద్, సెప్టెంబర్ 12, :తెలంగాణలో సందర్భం ఉన్నా లేకున్నా వివాదం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలన్న ఉద్దేశం వినా బీజేపీకి మరో లక్ష్యం, ధ్యేయం లేదన్నట్లుగా ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరు ఉన్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ఒక ప్రత్యేకత ఉంది. మత సామరస్యానికీ, సామాజిక సామూహికత్వానికి ప్రతీకగా జరిగే ఈ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలూ మమేకమై రాజకీయాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా జరుపుకునే ఒక పండుగ. అటువంటి కార్యక్రమం లో కూడా రాజకీయ లబ్ధిని వెతుక్కునే కార్యక్రమానికి పార్టీలు ఉపక్రమించడం పట్ల సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతున్నది. మహమ్మారి కారణంగా గత రెండేళ్లుగా సందడి కోల్పోయిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఈ ఏడాది కన్నుల పండువగా సాగింది. భక్త జనం తండోపతండాలుగా ఈ వేడుకను తిలకించేందుకు కదలి వచ్చారు. అత్యంత శోభాయమానంగా జరిగిన ఈ వేడుకలో పాలకుండలో ఉప్పుకణిక పడిన చందంగా మొజాంజాహీ మార్కెట్ వద్ద జరిగిన సంఘటన శోభాయాత్రకు ఓ మచ్చలా పరిణమించింది. హైదరాబాద్ లో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని తిలకించేందకు వచ్చిన అసోం సీఎం హేమంత్ బిశ్వశర్మ, ఆ పనిని పక్కన పెట్టి రాజకీయ ప్రసంగం చేయడం పట్ల సర్వత్రా నిరసన, వ్యతిరేకత వ్యక్తమౌతోంది. అసోం నుంచి వచ్చిన ఆయన ఇక్కడ రాజకీయ రచ్చకు కారణం అవ్వడాన్ని అంతా ఎత్తి చూపుతున్నారు. గతంలో ఎన్నడూ శోభాయాత్ర సందర్భంగా ఇటువంటి పరిస్థితి తలెత్తలేదని గుర్తు చేసుకుంటున్నారు.బీజేపీ కారణంగానే రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన శోభాయాత్రలో అనవసర వివాదం తలెత్తిందని విమర్శిస్తున్నారు. మొజాంజాహీ మార్కెట్ వద్ద గణనాథులను ఆహ్వానించేందుకు ఏర్పాటు చేసిన వేదిక పై ప్రసంగించిన అసోం సీఎం హేమంత్ బిశ్వశర్మ రాజకీయాలు మాట్లాడడవే వివాదానికి కారణమైంది. తెరాస నేత నందూలాల్ అసోంసీఎం ప్రసంగాన్ని అడ్డుకుని ఆయన చేతిలో మైకు లాక్కోవడానికి ప్రయత్నించారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న కార్యక్రమంలో హేమంత్ బిశ్వశర్మ రాజకీయ ప్రస్తావన తీసుకురావడం ఉద్రిక్తతకు కారణమైంది. ఇదే కాకుండా అంతకు ముందు కూడా ఇదే ఎంజేఎం మార్కెట్ దగ్గర ఫ్లెక్సీల విషయంలో కూడా వివాదం నెలకొంది. అసోం సీఎం హేమంత్ బిశ్వశర్మ ఫ్లెక్సీకి పోటీగా మంత్రి తలసాని ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు వచ్చిన తెరాస కార్యకర్తలను బీజేపీ కార్యకర్తలు, గణేష్ ఉత్సవ సమితి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆ తరువాత హేమంత్ బిశ్వశర్మ రాజకీయ ప్రసంగం ఘర్షణ పూరిత వాతావరణం ఏర్పడేందుకు కారణమైంది. కాగా గణేష్ నిమజ్జన శోభాయాత్రలో రాజకీయ ప్రసంగాలేమిటని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.ప్రతీ రోజు రాజకీయ విమర్శలతో ఒకరినొకరు దుమ్మెత్తిపోసుకునే తెరాస, బీజేపీలు ఒక్క రోజు తమ రాజకీయ విమర్శలకు, ప్రసంగాలకూ విరామం ప్రకటించేపాటి నియంత్రణను కూడా కోల్పోయాయా? అని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ గణేష్ శోభాయాత్రను కూడా రాజకీయ వేదికను చేయడానికి ప్రయత్నించడం పట్ల రాజకీయ వర్గాలలో సైతం విమర్శలు వ్యక్తమౌతున్నాయి. హైదరాబాద్ లో వినాయక శోభయాత్రను చూడటం తన అదృష్టంగా భావిస్తున్నానన్న అసోం సీఎం హేమంత్? బిశ్వ శర్మ అక్కడితో ఆగకుండా.. తెలంగాణ లో కేసీఆర్ కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వం ప్రజల పక్షాన ఉండాలి కానీ.. కుటుంబ పక్షాన ఉండకూడదన్నారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఫలాలు కేవలం ఒక్క ఫ్యామిలీ మాత్రమే అనుభవిస్తోందని , అలా కాకుండా మిగిలిన అన్ని కుటుంబాలకు మంచి జరిగేలా చూడాలని భాగ్యలక్ష్మి అమ్మవారిని కోరుకున్నాననీ పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా తెలంగాణలో టీఆర్ఎస్ పాలన రజాకార్ల పాలనను తలపిస్తోందని, కేసీఆర్ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించాలని పిలుపు నిచ్చారు. దీంతో ఈ వేదికపై రాజకీయ విమర్శలేమిటని పేర్కొంటూ టీఆర్ఎస్ నేత నందూ బిలాల్ మైకు లాక్కునేందుకు ప్రయత్నించగా ఆయనను గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు వేదికపై నుంచి లాగేశారు. ఏది ఏమైనా తెరాస కూడా ఒకింత నియంత్రణ పాటించి ఉంటే శోభాయాత్రకు రాజకీయ మరక అంటి ఉండేది కాదని సామాన్యులు సైతం అంటున్నారు. అదే సమయంలో అసోం సీఎం హేమంత్ బిశ్వశర్మ తీరును తప్పుపడుతున్నారు.

# కేటీఆర్ కు లైన్ క్లియర్ అయినట్టేనా..?



హైదరాబాద్, సెప్టెంబర్ 12, :ఇటు ప్రభుత్వం అటు పార్టీ పైకి మేడిపండులా నిగనిగలాడుతూ కనిపిస్తున్నా, లోపలి లుకలుకలు రోజు రోజుకూ మరింతగా వికటిస్తున్నాయని అంటున్నారు. ఒక విధంగా మాటలు లేవు మాట్లాడుకోవడాలు లేవు అన్నట్లుగా అంతర్గత లుకలుకలు భగ్గుమంటున్నాయని అంతర్గత వేగులు అందిస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అంతే కాదు, ఇంతవరకు ప్రగతి భవన్ నాలుగు గోడల మధ్య ఎంతో కొంత గుట్టుగా, గుంభనంగా సాగుతున్న, కల్వకుట్ల ఫ్యామిలీ డ్రామా, ఇప్పుడు తెలంగాణ భవన్ కు చేరిందని, 'ప్రగతి భవన్' సన్నిహిత వర్గాలు ఆధారాలతో సహా విపులంగా వివరిస్తున్నాయి. నిజమే, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు కాదు, చాలా కాలంగా జాతీయ రాజకీయాల గురించి ముచ్చటిస్తూనే ఉన్నారు. వ్యూహాలు రచిస్తున్నారు. ఉపన్యాసాలలో వినిపిస్తున్నారు. నిజానికి 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే ముఖ్యమంత్రి జాతీయ రాజకీయాల గురించి మాట్లాడుతున్నారు. అయితే, కేసీఆర్ జాతీయ రాజకీయ ప్రస్థానం అప్పుడూ ఇప్పుడూ కూడా ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగానే సాగుతోంది. అయితే ఇటీవల కాలంలో కేసీఆర్ సందర్భం ఏదైనా జాతీయ రాజకీయాల గురించే మాట్లాడుతున్నారు. తాజగా, నిజామాబాద్ సభలోనూ కేసీఆర్, మీరు ఊ.. అంటే చాలు జాతీయ రాజకీయాల్లోకి దూకేస్తా అంటూ తెలంగాణ ప్రజల ఆనతి కోరారు. అంతే కాదు, 2024 ఎన్నికల తర్వాత,కేంద్రంలో వచ్చేది మన ప్రభుత్వమే అని భరోసా ఇచ్చారు. జాతీయ రాజకీయ ప్రస్థానం మొదలు పెడుతున్నా.నిజామాబాద్ సభ సాక్షిగా నిర్ణయం తీసుకుంటున్నా,వచ్చే ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడేది మన ప్రభుత్వమే. దేశవ్యాప్తంగా రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్తును ఇస్తాం. తెలంగాణ పథకాలన్నింటినీ అమలు చేస్తాం అని ప్రకటించారు. ముఖ్యమత్రి అర్జెంటుగా, జాతీయ రాజకియాల్లోకి వెళ్లి పోవాలని, తెరాస జిల్లా అధ్యక్షుల సాముహికంగా చేసిన డిమాండ్ ఇప్పుడు, ముఖ్యమంత్రి జాతీయ రాజకీయ వ్యూహంలో కొత్త కోణాన్ని అవిష్కరించిందని అంటున్నారు. నిజానికి, తెలంగాణ భవన్ లో జరిగిన తెరాస జిల్లా అధ్యక్షుల సాముహిక డిమాండ్ వైనక చాలా పెద్ద రాజకీయమే ఉందని అంటున్నారు. ముఖ్యమత్రి జాతీయ రాజకియాల్లోకి వెళ్ళడం, ఆ వెంటనే కల్వకుట్ల తారక రామారావు .. అను నేను ... అంటూ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఒకేసారి, ఒక దాని కొకటి సమాంతరంగా సాగుతాయని అందరూ అనుకుంటున్నదే. అందులో రహస్యం ఏమీ లేదు.ఇక అక్కడి నుంచి, కేటీఆర్ పట్టాభిషేకానికి ఎన్ని సార్లు సనాహాలు జరిగాయో, ఎన్ని ముహూర్తాలు మురిగి పోయాయో, లెక్కలేదు. నిజానికి ఒక దశలో, తెరాస మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కేటీఆర్ పట్టాభిషేకం గురించి బహిరంగంగానే ప్రకటనలు చేశారు. కానీ, వినాయకుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలే అన్నట్లు కేటీఆర్ పట్టాభిషేకానికి ఎప్పటి కప్పుడు విఘ్నాలు అడ్డుపడుతున్నాయి. ఈ కారణంగానే తండ్రీ కొడుకుల మధ్య దూరం పెరిగిందని అంటున్నారు. తాజాగా తెరాస జిల్లా అధ్యక్షులు సాముహికంగా విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే జాతీయ పార్టీ పెట్టాలనే డిమాండ్ వినిపించారని అంటున్నారు. ఒక విధంగా పరోక్షంగానే అయినా కీటీఆర్ ను ముఖ్యమంత్రిని చేయమని జిల్లా అధ్యక్షులు ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారని అనుకోవచ్చని అంటున్నారు. నిజానికి, ఈ డిమాండ్ చేసింది జిల్లా అధ్యక్షులే అయినా చేయించింది మాత్రం, కేటీఆర్ అని పార్టీ వర్గాల్లో వినవస్తోంది.జాతీయ పార్టీ ఏర్పాటు చేసి కేసీఆర్ మకాం ఢిల్లీకి మారిస్తే, ఆ విధంగా అయినా కేటీఆర్ కల నిజమవుతుందని, పార్టీలో, ఫ్యామిలీలో కేటీఆర్ వర్గం భావిస్తోంది. అయితే, జాతీయ పార్టీ పెట్టినా, కేసీఆరే, ముఖ్యమంత్రిగా కొనసాగుతారనే జిల్లాల అధ్యక్షుల సాముహిక మీడియా సమావేశంలో డిమాండ్ చేయడం కొసమెరుపు. ఈ కొస మెరుపుతో, కేటీఆర్, చివరి ఆశ కూడా నీరుగారిపోయిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సో కేసీఆర్ కు సీఎం కావాలన్న అశ.. ఇప్పటికైతే అడియాశగానే మిగిలిపోయింది. సో కేటీఆర్ కి ముఖ్యమంత్రి యోగం లేదని, కనీసం ఈ సారికి అయితే, ఆ అవకాశం లేనట్లే అంటున్నారు.

# ద్వారకాపీఠం స్వామి శివక్యైం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, :ద్వారకాపీఠం శంకరాచార్య స్వామి స్వరూపానంద సరస్వతి పరమపదించారు. 99 ఏళ్ల వయసులో ఆయన మధ్యప్రదేశ్? నార్సింగ్పుర్లోని పీఠంలో తుది శ్వాస విడిచారు. స్వామి స్వరూపానంద సరస్వతి 1924 సెప్టెంబర్ 2న మధ్యప్రదేశ్లోని జబల్పూర్ సమీపంలోని దిఘోరీ గ్రామంలో జన్మించారు. తొమ్మిదేళ్లకే ఇంటి నుంచి వెళ్లిపోయిన స్వరూపానంద.. ధర్మ ప్రచార యాత్రలు చేపట్టారు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 19 ఏళ్ల వయసులో స్వాతంత్ర్య పోరాటం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ సాధువుగా పేరు తెచ్చుకున్నారు. ఈ సమయంలో ఆయన తొమ్మిది నెలలు వారణాసి, ఆరు నెలలు మధ్యప్రదేశ్?లోని జైలులో ఉన్నారు. 1950లో దండి సత్యాగ్రహం సమయంలో సన్యాస దీక్ష చేపట్టిన ఆయన స్వామి స్వరూపానంద సరస్వతిగా ప్రసిద్ధి చెందారు. స్వాతంత్ర్య పోరాటం తర్వాత కూడా ఆయన చాలా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈ సమయంలో తను కర్పాత్రి మహారాజ్ ఏర్పాటు చేసిన రామరాజ్య పరిషత్కు ఆయన అధ్యక్షుడిగా కూడా ప్రకటించబడ్డారు.రామ మందిర నిర్మాణం కోసం సుదీర్ఘ న్యాయ పోరాటం చేశారు. ఇది కాకుండా, జమ్ము కశ్మీర్ నుంచి ఆర్టికల్ 370 ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్లో హైడ్రో ప్రాజెక్ట్ను వ్యతిరేకించారు.

ఏకరీతి పౌర చట్టం కోసం వాదించడం వంటి అనేక అంశాలపై ఆయన మాట్లాడారు.శంకరాచార్య స్వామి స్వరూపానంద సరస్వతి 2 సెప్టెంబర్ 1924న మధ్యప్రదేశ్లోని సియోనిలోని డిఘోరి గ్రామంలో జన్మించారు. స్వామిజీ తండ్రి పేరు ధనపతి ఉపాధ్యాయ, తల్లి పేరు గిరిజా దేవి. తల్లిదండ్రులు అతనికి పోతి రామ్ ఉపాధ్యాయ అని పేరు పెట్టారు.

## 14 నుంచి విమోచన కార్యక్రమాలు...

హైదరాబాద్, సెప్టెంబర్ 12, :సెప్టెంబర్ 17పై ఫుల్ ఫోకస్ పెడుతోంది టీబీజేపీ. కేవలం ఆ ఒక్కరోజుకే పరిమితం కాకుండా నాలుగు రోజుల ముందు నుంచే హడావిడి చేయాలని ప్లాన్ చేస్తోంది. ఇంతకీ, వ్యూహామేంటి? ఏమేం చేయాలనుకుంటోంది?.. 2023లో అధికారమే లక్ష్యం, అందుకోసం అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఒడిసిపట్టుకుంటోంది తెలంగాణ బీజేపీ. ఇప్పుడు సెప్టెంబర్ 17, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అందుకు వేదికగా మార్చుకుంటోంది కాషాయదళం. కేవలం ఆ ఒక్కరోజే సెలబ్రేషన్స్‌కు పరిమితం కాకుండా, మూడు నాలుగు రోజుల ముందు నుంచే ప్రోగ్రామ్స్ కండక్ట్ చేస్తూ జనంలోకి వెళ్లేందుకు వ్యూహరచన చేస్తోంది. సికింద్రాబాద్‌లో సమావేశమైన మెయిన్ లీడర్స్, తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఎలా జరపాలి? పార్టీపరంగా ఏం చేయాలో చర్చించారు. సెప్టెంబర్ 17కి ముందు సన్నాహక ప్రోగ్రామ్స్ చేపట్టాలని నిర్ణయించారు. స్టేట్ వైడ్‌గా బైక్ ర్యాలీలు నిర్వహించి, సెప్టెంబర్ 17న గ్రామగ్రామాన జెండా వందనం చేపట్టనున్నారు. అలాగే, పల్లెల్లో పోరాట స్ఫూర్తిని నింపేలా బురుజులను అలంకరించాలని కేడర్‌కు పిలుపునిచ్చింది బీజేపీ. స్వాతంత్ర్య సమరయోధులు, నిజాం అండ్ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన యోధులు, వాళ్ల కుటుంబాలను ఇన్వాల్వ్ చేయాలనుకుంటోంది బీజేపీ. అందుకోసం యోధుల కుటుంబాలను కలుస్తున్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారంలో స్వాతంత్ర్య సమరయోధుడు షాయుబుల్లాఖాన్ ఫ్యామిలీని కలిశారు కిషన్. సెప్టెంబర్ 17న బీజేపీ నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. అలాగే, హైదరాబాద్ గోషామహల్‌లో మరో స్వతంత్ర సమరయోధుడు వందేమాతరం రామచందర్‌రావు కుటుంబ సభ్యులను కలిసి సన్మానించారు కిషన్‌రెడ్డి. అధికారికంగా, పార్టీపరంగా ప్రోగ్రామ్స్ కండక్ట్ చేస్తున్నప్పటికీ, అవన్నీ ప్రజా కార్యక్రమల్లా ఉండేలా జాగ్రత్తపడుతోంది బీజేపీ.

# ఆత్మహత్యల్లో పురుషులే ఎక్కువ..!

చాలా చిన్న కారణాలకే కొందరు ఉసురు తీసుకుంటున్నారు. పాశ్చాత్య ప్రభావం, మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోవడం కూడా కారణమే. గతంలో తీవ్ర సమస్య ఎదురైనపుడే మాత్రమే అఘాయిత్యానికి ఒడిగట్టేవారు. ఇప్పుడు చిన్న సమస్యకూ చావే పరిష్కారమనుకుంటున్నారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండడం వలన ఏ ఇబ్బంది వచ్చినా అందరూ కలిసి చర్చించుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవడంతో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఆత్మహత్యలను మానవ సంకల్పంతో నియంత్రించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. సమస్య రాగానే గాబరపడి పడిపోయి ఆత్మహత్య చేసుకోవడం పరిష్కారం కాదు' అన్నారు జిడ్డు కృష్ణమూర్తి. నేడు దేశంలో ఆత్మహత్య జాతీయ సామాజిక సమస్యగా మారిపోయింది. దేశంలో ప్రమాద మరణాలు, ఆత్మహత్యల గురించి ఆగస్టు చివరి వారంలో 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2021 వార్షిక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం గత యేడాది 18 నుండి 30 సంవత్సరాల మధ్య ఉన్న 56,544 మంది యువతీ యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. మొత్తం ఆత్మహత్యలలో ఇది 34 శాతం. 30-45 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు 53,044 మంది ప్రాణాలు తీసుకున్నారు. వీరి శాతం 31.72. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో యేటా ఎనిమిది లక్షల మందికి పైగా, అంటే ప్రతి 30 సెకనులకు ఒకరు ఆత్మబలిదానం చేసుకుంటున్నారు. ప్రపంచంలో జరిగే ప్రతీ నాలుగు ఆత్మహత్యలలో ఒకటి భారత్‌లోనే నమోదవుతోంది. భారతదేశంలో సగటున రోజూ 450 మంది, గంటకు 18.7 మంది, నిమిషానికి ముగ్గురు బలవుతున్నారు. పురుషులు సగటున రోజుకి 326 మంది , గంటకు 13.6 మంది, ప్రతి 4.4 నిమిషాలకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మహిళలు మాత్రం సగటున రోజుకి 124 మంది, గంటకు 5.1 మంది, అనగా ప్రతి 12 నిమిషాలకు ఒక మహిళ ప్రాణాలు తీసుకుంటున్నది. 2021లో ఆత్మహత్య చేసుకున్న పురుషులు 1,18,979 కాగా, మహిళలు సంఖ్య 45.260. సహనానికి మారుపేరైన మహిళ కష్టాలలోనూ అంతే మనో నిబ్బరాన్ని ప్రదర్శిస్తోంది. అయితే, లేత ప్రాయంలో అమ్మాయిలు ఎక్కువగా ఆత్మహత్య చేసుకుంటున్నారు. పురుషులు మాత్రం కష్టాలు రాగానే డీలా పడిపోతున్నారు. 2021లో దేశంలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. రోజూ సగటున 36 మంది విద్యార్థుల ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. వ్యవసాయ రంగంలో ఉన్నవారు 10,881 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో 5,318 మంది రైతులు 5,563 మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. మొత్తం ఆత్మహత్యలలో వీరి వాటా 6.6 శాతం. ఇవి ప్రభుత్వాలు చెప్పే లెక్కలు మాత్రమే. నిజమైనవి ఇంకా ఎక్కువగా ఉంటాయి. 53 మెగా నగరాలలో 25,891 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఢిల్లీలో అత్యధికంగా 2,760, చెన్నయిలో 2,699, బెంగళూరులో 2,292, ముంబయిలో 1,436 మంది బలవన్మరణం చెందారు. తెలంగాణలో ఆత్మహత్యల రేటు 26 శాతంగా ఉంది. దేశంలో రోజువారీ కూలీలు నలుగురిలో ఒకరు ప్రాణాలు తీసుకుంటున్నారు. 2021లో ఆత్మహత్య చేసుకున్న వారిలో 11.0 శాతం నిరక్షరాస్యులు, 15.8 శాతం ప్రాథమిక స్థాయి వరకు, 19.1 శాతం మధ్య స్థాయి వరకు, 24 శాతం మెట్రిక్ వరకు చదువుకున్నారు. 16.2 శాతం ఉన్నత విద్య, 1.2 శాతం డిప్లొమా, 4.6 శాతం గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్, అంతకంటే ఎక్కువ చదువుకున్నవారు ఉన్నారు. డిప్రెషన్, మాదకద్రవ్యాల వినియోగం, సైకోసిస్ వంటి మనోవిక్షేప వ్యాధులకు సంబంధించి ఆత్మహత్యలు అధికంగా జరుగుతున్నాయి. ఆత్మహత్యలను మానవ సంకల్పంతో నియంత్రించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. కుటుంబ సమస్యలతో 33.2 శాతం, అనారోగ్యంతో 18.6 శాతం, మాదక ద్రవ్యాలు/ మద్యంతో 6.4 శాతం, వివాహ సమస్యలతో 4.8 శాతం, ప్రేమలు, పెళ్లిళ్ల కారణంగా 4.6 శాతం, దివాళా లేదా రుణభారంతో 3.9 శాతం, పరీక్షలలో వైఫల్యంతో 1.0 శాతం, నిరుద్యోగంతో 2.2 శాతం, వృత్తి/కెరీర్ సమస్యలతో 1.6 శాతం, ఆస్తి వివాదంతో 1.1 శాతం, ప్రియతముల మరణాలతో 1.2 శాతం, పేదరికంతో 1.1 శాతం ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. రోజువారీ జీవితంలో విపరీత మార్పులు. ఓ చోట ఉండకుండా అటూ ఇటూ తిరుగుతుండడం. ఏ పని మీదా ఆసక్తి లేకపోవడం. చేసే పనిమీద ఏకాగ్రత లేకపోవడం. ప్రతి చిన్న విషయానికి ఆగ్రహం చెందడం. కుటుంబ సభ్యులు, స్నేహితులపై తరచూ అనహనం వ్యక్తం చేయడం. దిగాలుగా, దుఃఖంతో ఉండడం. చీకటిలో ఎక్కువ సేపు ఒంటరిగానే గడపడం, ఎవరినీ కలవకుండా ఒంటరిగా ఇష్టపడడం, రాత్రివూట మెలకువగా ఉండడం. ఏమీ సాధించలేకపోయాననే నిర్వేదం, తాను బతకడం వలన ఎవరికీ ఉపయోగం లేదనుకోవడం. ఇతరులపై భారంగా ఉన్నామని భావించడం. ఆత్మహత్య గురించి పదే పదే మాట్లాడటం, ఆత్మహత్య చేసుకునే మార్గాలను వెతకడం తదితర లక్షణాలు ఉంటే అప్రమత్తంగా ఉండాలి.

# మునుగోడు ప్రచారం షురూ...




హైదరాబాద్, సెప్టెంబర్ 12, :మునుగోడు ఉప ఎన్నికకు ప్రధాన పార్టీలు రెడీ అవుతున్నాయి. ఉప ఎన్నికలో సత్తా చాటేందుకు సంసిద్ధమవుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో పార్టీని పటిష్ఠ పరిచేందుకు.. నియోజకవర్గాన్ని చుట్టేసేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి. ముందుగా అధికార టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తుంది. నియోజకవర్గంలో పార్టీ చేరికలను విస్తృతం చేస్తున్నారు జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డి. ఇవాళ నాంపల్లి మండలం మల్లపురాజు పల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ భవనం, పాఠశాల అదనపు గదులు, పల్లె ప్రకృతి వనాన్ని ప్రారంభించారు మంత్రి జగదీశ్ రెడ్డి. దేశానికి ద్రోహం చేస్తున్న బీజేపీకి మునుగోడు ప్రజలు ఉప ఎన్నికతో సరైన గుణపాఠం చెబుతారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బిజెపికి మూడో స్థానమేనని చెప్పారు. బీజేపీలో చేరి రాజగోపాల్ రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడని విమర్శించారు మంత్రి జగదీశ్.మునుగోడులో మరోసారి తనసత్తా చాటేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇవాళ నియోజకవర్గ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ఇంచార్జి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వివేక్ తోపాటు పలువురు నేతలు హాజరయ్యారు. మునుగోడు ఉప ఎన్నిక.. భవిష్యత్తుకు సంబంధించిన పోరాటం అని చెప్పారు బీజేపీ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు ఉపఎన్నిక .. తెలంగాణ మలీ ఉద్యమం అని అన్నారు. ఈ ఉప ఎన్నికతో ప్రజలు కను విప్పు కలిగే తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు రాజగోపాల్ రెడ్డి.మునుగోడు ఉప ఎన్నికకు పార్టీని స్పీడ్ అప్ చేశారు కాంగ్రెస్ నేతలు. నియోజకవర్గంలో తన గెలుపునకు కృషి చేయాలంటూ.. ప్రచారానికి పార్టీ పెద్దలను ఆహ్వానిస్తున్నారు ముగుగోడు ఇంచార్జి పల్వాయి స్రవంతి. ఈమేరకు ఇవాల భట్టి విక్రమార్క, విహెచ్‌తో భేటీ అయ్యారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. మరోవైపు ఎంపీ కోమటిరెడ్డిని సైతం కలిసారు పాల్వాయి స్రవంతి. మునుగోడు ప్రచారానికి వస్తానని కోమటిరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన చల్లమల్ల కృష్ణారెడ్డి, అభ్యర్థి స్రవంతితో నిన్న రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన ఇంట్లో భేటీ అయ్యారు. ఉపఎన్నికలో కలిసి పనిచేయాలని కోరారు. ఈనెల 18 నుంచి కీలక నేతల ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. ఇప్పటికే టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ లు చలో మునుగోడుకు పిలుపునిచ్చాయి. అందులో భాగంగానే ఈనెల 15 నుంచి మంత్రులు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మునుగోడు బాట పట్టనున్నారు. పార్టీ గెలుపునకు కృషి చేసేందుకు మండలాలు, గ్రామాలవారీగా నేతల జాబితాను పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈనెల 18 నుంచి కాంగ్రెస్ సైతం మునుగోడు ప్రచారాన్ని ముమ్మరం చేస్తుంది. ఇక బీజేపీ నుంచి రాజగోపాల్ రెడ్డి నిత్యం ప్రజలతో ఉంటున్నారు. పార్టీ ప్రధాననేతలను పిలిచి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# మరో స్కాంలో ఆప్ సర్కార్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, :దేశ రాజధాని ఢిల్లీలో అధికార ఆప్, లెఫ్టినెంట్ గవర్నర్ మధ్య వ్యవహారం మరింత ముదిరింది. లిక్కర్ స్కామ్ కొలిక్కి రాకముందే డీటీసీ బస్సుల కొనుగోళ్లపై సీబీఐ దర్యాప్తునకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశించడం సంచలనంగా మారింది. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కొనుగోలు చేసిన లో ఫ్లోర్ బస్సు ల వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ విచారణ జరిపేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తెలిపారు. దీన్ని బీజేపీ స్వాగతించగా ఆప్ ఖండించింది. సీఎం కేజ్రీవాల్ అవినీతికి మారుపేరుగా నిలిచారని బీజేపీ నేత గౌరవ్ భాటియా విమర్శించారు. ఇప్పటికే మనీలాండరింగ్ కేసుతో పాటు లిక్కర్ స్కాంలో సీబీఐ దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. తాజాగా బస్సుల స్కాం వెలుగులోకి వచ్చిందని మండిపడ్డారు. అయితే డీటీసీ బస్సుల కొనుగోళ్లలో ఎలాంటి స్కాం జరగలేదని ఆప్ వెల్లడించింది. అసలు లోఫ్లోర్ బస్సుల కొనుగోళ్ల టెండర్లను రద్దు చేసినప్పుడు స్కాం జరిగేందుకు ఎలా అవకాశం ఉంటుందని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికే లెఫ్టినెంట్ గవర్నర్ ఆప్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు.కాగా 2019 జులై లో వెయ్యి లోఫ్లోర్ బస్సుల కొనుగోలు, 2020లో వాటి వార్షిక నిర్వహణకు సంబంధించిన బిడ్ల వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని ఎల్‌జీకి ఫిర్యాదు వచ్చింది. బస్సుల కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఢిల్లీ రవాణాశాఖ మంత్రిని ఛైర్మన్ గా కమిటీ నియమించారు. ఇప్పటికే మద్యం పాలసీలో స్కాం కు పాల్పడ్డారన్న ఆరోపణలతో సతమతమవుతున్న ఆప్ కు ఈ కొత్త స్కాం మరింత తలనొప్పిగా మారింది. వీటిపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు ప్రారంభించాయి. దీంతో రెండింటినీ కలిపి దర్యాప్తు చేయాలని ఎల్జీ సక్సేనా సూచించినట్లు తెలుస్తోంది.

AAM AADMI PARTY


## మనం గెలవాలంటే

"మన సంస్థలను మనమే నిర్మించుకోవాలి "

బహుజన రాజ్యాధికార స్థాపనకు ప్రజాపాలన పేపర్ ని నియోజకవర్గాల వారీగా కనీసం 10 పేపర్లు అంతకంటే ఎక్కువ పేపర్లు ఆయా నియోజకవర్గాల్లో వెళ్ళేటట్లుగా నాయకులు బాధ్యత తీసుకునేటట్లుగా చేయవలెను.

బాధ్యత తీసుకునే వారికి వారి ద్వారా వచ్చిన అడ్వర్టైజ్మెంట్స్ లో 60 శాతం వారికి ఇవ్వబడును.

ఈ దిగువన తెలిపిన నాయకులు బాధ్యత తీసుకుంటున్నారు..

మిగిలిన వారు కూడా బాధ్యత తీసుకోగలిగితే మన వాయిస్ వెళ్లి గెలవడానికి సహాయకారిగా ఉంటుంది.

**Sivabhagyarao Bahujan IRS-vrs**
Chairman
**Prajapalana**

Jai puley Jai Bheem Jai bharath

ఈ దిగువ తెలిపిన పార్స్ సభ్యులకు ప్రజాపాలన పేపరు పంపబడును

| S.NO | NAME | DESIGNATION | PLACE |
|---|---|---|---|
| 1 | DR. Guduru Seethamahalaxmi | CWC MEMBER, AP State Incharge PARS | Vizag |
| 2 | Gunji Narasimharao | CWC MEMBER, PARS | Nellor |
| 3 | Dr. P.Paramasivan | State Vice President, Tirupathi & Chittoor PARS | Tirupathi |
| 4 | Nammi Apparao | PARS AP State Co-ordinator | Vijayawada |
| 5 | A. Balaram | AP State Co-ordinator, PARS | Pileru |
| 6 | K.Vara Prasad | AP State Secretary, Retd Teachers Vibhagamu, PARS | Bapatla |
| 7 | S.Tirupal | AP State Secretry,NGO Vibhagamu Ananthapur & Hindupur PARS | Ananthapur |
| 8 | Dasari Shyam Living Stone | Vice President, Retired Teachers Vibhagamu PARS | Bapatla |
| 9 | Kagita Achyut Puley | AP State Secretary Eluru, Machilipatnam PARS | Eluru |
| 10 | Repudi Doraka Vani | State Secretary,Humanrights Vibhagamu, Guntur &Narsaraopeta PARS | Guntur |
| 11 | Jada Vijay Kumar | Parliament President, Retd Employees Vibhagamu, PARS | Ongole |
| 12 | Mundlapati Pichiah | President,Badvel Assembly PARS | Badvel |
| 13 | P.Prakasham | Branch Manager,Sneha MACS Ponnur | Ponnur |
| 14 | Sudheer | Reporter | Narasaraopeta |
| 15 | Ratna Raju | Reporter | Nandigama |
| 16 | A.Punnarao | CEO, SNEHA MACS | Vizag |
| 17 | Ch. Chiranjeevi | Sneha Club, Ex Governor | Vizag |
| 18 | Katikala Ravi Kumar | AP State Co-ordinator, PARS | Guntur |
| 19 | P.Anand | Accounts Assistant Officer, AP Genco | Nellor |
| 20 | Kakani Prasada Rao | Assembly President, PARS | Penamalur |
| 21 | Loda Apparao | Assembly President, PARS | Rajamundry Rural |
| 22 | Stalin Babu | Assembly President, PARS | Prattipadu |
| 23 | Jakkala Krupa kumar | Presidnent of Minority section | Prodduturu |
| 24 | Kamalapuram Kiran | President of Ex.Service Man section | Jammalamadugu |
| 25 | Kommalapati Anjaneyulu | President of Building Construction Union | Kamalapuram |
| 26 | Gollapalli bhaskar | President of Education Vibhagamu | Kadapa Dist |
| 27 | Suneetha | President of Women's Vibhagamu | Pileru |
| 28 | Gangadhar rao Nukasani | PARS | Ongole |
| 29 | Nagendra Nayak | State Secretary of Engineering Vibhagamu | Kadapa |
| 30 | Bima Mahesh | Reporter | Amalapuram |
| 31 | Sri Savarala Ganesh | President of the Unorganized Labor Union | Division Chodavaram |
| 32 | P.Siddartha Ambedkar | Coordinating committee of Youth Associastions | Malkapuram |
| 33 | Ravada Satyanarayana | President of Unorganized sector workers union, | Nathavaram |
| 34 | D.Siva | Blood donors vibhagamu working President | Thagarapuvalasa |
| 35 | Sri Uppina Valasa Rao | President of youth organization | Srihari puram |
| 36 | Ghanta Rajkumar | Narasapur Parla ment NGO విభాగపు అధ్యక్షుడు | Bhimavaram |

Please contact this No:8886022523 Krishna veni , Appajee 9000621111
(Prajapalana Telugu Daily)

# ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 13, సెప్టెంబరు 2022


## అణచివేతనే వారి అసలు మతం

ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ నిరంకుశ పాలనను విశ్లేషిస్తూ దేశ విదేశాలలో పలు వ్యాసాలు, పుస్తకాలు వెలువడ్డాయి. ఇందులో క్రిస్టోఫ జెఫెలో రాసిన 'మోదీ'స్ ఇండియా' (హిందు నేషనలిజమ్ అండ్ ది రైజ్ ఆఫ్ ఎథ్నిక్ డెమొక్రసీ) కూడా ఒకటి. ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడటం పరిపాటి. కానీ అన్నీ ఆదర్శవంతమైన ఉదారవాద ప్రజాస్వామ్యాలు (లిబరల్ డెమొక్రసీస్) కావనీ, భిన్న సంకర రూపాలలో ఉన్నాయనీ రచయిత అభిప్రాయపడ్డాడు. భారత దేశం ఒకప్పుడు కన్సర్వేటివ్ డెమొక్రసీగా ఉండేదనీ, ఆ తరువాత 'ప్రజాస్వామ్య ప్రజాస్వామీకరణ' (డెమొక్రటైజేషన్ ఆఫ్ డెమొక్రసీ) జరిగిందనీ, ఇప్పుడు మోదీ పాలనలో ఎథ్నిక్ డెమొక్రసీగా మారి, క్రమంగా హిందు రాష్ట్ర నుంచి నిరంకుశ హిందు రాజ్యంగా మారిపోయిందని వివరించాడు.మన దేశంలో ప్రజాస్వామ్యం రూపాంతరం చెందిన విధానాన్ని తన కోణంలో రచయిత క్రిస్టోఫ జెఫెలో పుస్తకంలో వివరించారు. తొలి ప్రధాని నెహ్రూ సోషలిస్టు విధానాలను ప్రవచించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులపై, ప్రాంతీయంగా బలంగా ఉన్న నేతలపై ఆధారపడవలసి వచ్చింది. దీనివల్ల కింది తరగతుల సంక్షేమ విధానాలను అమలు చేయలేకపోయింది. వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం కమిషన్‌ను నియమించింది. కానీ ఓబీసీలకు కోటా కల్పించాలన్న ఆ కమిషన్ సూచనను తిరస్కరించింది. ఇందిరాగాంధీ కాలంలో కూడా ఈ స్థానిక పెద్దలపైనే పార్టీ ఆధారపడవలసి వచ్చింది. అందువల్ల వెనుకబడిన వర్గాల ప్రయోజనాల కోసం ఎటువంటి సంస్కరణలను చేపట్టలేదు. 1977లో ఇందిరాగాంధీ ఓడిపోయి ప్రతిపక్షాలు అధికారంలోకి వచ్చిన తరువాత రెండవ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కానీ కొద్ది కాలంలోనే కాంగ్రెసేతర పక్షాల ప్రభుత్వం కూలిపోయింది. 1980 ఎన్నికలలో మళ్ళీ ఇందిరాగాంధీ అధికారం చేపట్టిన తరువాత సామాజిక మార్పు అజెండాను పట్టించుకోలేదు. ప్రైవేటు రంగ అండతో ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించారు. ఆ తరువాత రాజీవ్ గాంధీ కూడా ఇదే విధానాన్ని కొనసాగించాడు. ప్రజాస్వామ్య రాజ్యంగా ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న భారత్‌లో ఇప్పుడు నిరంకుశ రాజ్య స్థాపన జరుగుతున్నదని రచయిత క్రిస్టోఫ జెఫెలో వివరించారు. మోదీతో సహా బీజేపీ నాయకులెవరూ ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్యతత్వాన్ని, భిన్నత్వాన్ని అంగీకరించరు. అట్టడుగు వర్గాల సంక్షేమాన్ని కోరుకోరు.రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీని ఇతర రాజకీయ పక్షాలు ఓడించడంతో మన ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజాస్వామీకరణ ప్రారంభమైందని పుస్తక రచయిత అభిప్రాయపడ్డాడు. 1977లో ఇందిరాగాంధీని, తరువాత రాజీవ్ గాంధీని ఓడించిన తీరులో సారూప్యాలు చాలా ఉన్నాయి. ఈ రెండు సందర్భాలలోనూ కాంగ్రెస్‌ను ఓడించిన పక్షాలలో భిన్నత్వం చాలా ఉన్నప్పటికీ, ఒక సామ్యం కూడా ఉన్నది. ఉన్నత వర్గాల ఆధిపత్యాన్ని దెబ్బకొట్టాలనే లక్ష్యం ఈ పక్షాలలో కనిపిస్తుంది. ఇక్కడ ఉన్నత వర్గాలంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాలే అని కాదు. స్థానికంగా బలంగా ఉన్న ఈ ఇతర కులాలు శూద్ర వర్గం కిందికే వస్తాయి. హరిత విప్లవం వల్ల లబ్ధి పొందిన రైతు వర్గాలు కూడా ఇందులో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ ఉన్నత వర్గాల ప్రాతినిధ్య పార్టీ కాగా, 1977 నుంచి 80 వరకు అధికారం నెరిపిన జనతా పార్టీ, 1989 నుంచి 91 వరకు పాలించిన జనతాదళ్ కింది తరగతులకు ప్రత్యేకించి వెనుకబడిన తరగతులకు ప్రాతినిధ్యం వహించేవి. ఓబీసీల స్థితిగతులు, వారి పురోభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సూచించడానికి జనతా పార్టీ ప్రభుత్వం మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ దానిని పట్టించుకోలేదు. కానీ జనతాదళ్ అధికారంలోకి రాగానే ఈ కమిషన్ సూచనల మేరకు బీసీలకు కోటాను అమలు చేయతలపెట్టింది.మండల్ కమిషన్ సూచనల అమలుకు వ్యతిరేకంగా ఉన్నత వర్గాలు ఆందోళన చేపట్టాయి. ఈ ఆందోళన తమను అవమానించేదిగా ఉందని భావించిన బీసీలు సమీకృతమయ్యారు. బీసీలు ఉన్నత వర్గాలకు కాకుండా బీసీలకే ఓటేయడం ప్రారంభించారు. దీనివల్ల విద్యావంతులు కానట్టి గ్రామీణ ప్రజాబాహుళ్యం రాజకీయ రంగంలో ఒక ప్రబల శక్తిగా అవతరించింది. ఇదొక నిశ్శబ్ద విప్లవం. జనతాదళ్ వంటి ప్రాంతీయ పార్టీల మూలంగా హిందీ ప్రాంతం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యే బీసీల సంఖ్య రెట్టింపయి ఇరువై శాతానికి చేరుకున్నది. అనతికాలంలో జనతాదళ్ ప్రభుత్వం కూలిపోయినప్పటికీ, ఆ పరిణామం ఆగలేదు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను విస్మరించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ పార్టీ కూడా ఓబీసీ అభ్యర్థులను భారీగా నిలబెట్టింది. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీల సంక్షేమానికి అనుగుణమైన నిర్ణయాలు తీసుకోసాగింది. ఇది ఉన్నత వర్గాలకు ఆగ్రహం తెప్పించింది. మొదట ఉన్నత, మధ్యతరగతి వర్గాలు ఉదాసీనంగా వ్యవహరించాయి. 1990 దశకం చివర నుంచి 2000 సంవత్సరం వరకు ఓటేసిన వారి సంఖ్య తగ్గింది. ఆ తరువాత ప్రతిఘాత విప్లవాన్ని ప్రారంభించాయి. ఉన్నత వర్గాల ప్రతీకారానికి రాజకీయ రూపంగా బీజేపీ మారింది. రిజర్వేషన్ కులపరంగా కాకుండా ఆర్థికపరంగా ఉండాలని సూచించింది. 1920 దశకం నాటి హిందుత్వ సిద్ధాంతాన్ని చేపట్టింది. ఇస్లాం వల్ల ప్రమాదం ఉందనీ, కులాలకు అతీతంగా హిందు ఐక్యత అవసరమని బోధించడం మొదలుపెట్టింది. కోటా రాజకీయాల నుంచి ఓబీసీల దృష్టిని మళ్ళించడానికి బీజేపీ అయోధ్య ఉద్యమాన్ని లేవదీసింది. అద్వానీ స్వయంగా రథ యాత్ర చేపట్టింది మండల్ రాజకీయాలకు వ్యతిరేకంగానే.1993లో ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ, బీఎస్పీ వంటి కిందితరగతుల చేతిలో బీజేపీ పరాజయం పాలైంది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ దెబ్బకు చతికిల పడింది. బీజేపీకి ఇక బీసీలను నాయకులుగా మార్చక తప్పలేదు. హుకుందేవ్ నారాయణ్ యాదవ్, ఉమాభారతి వంటి నాయకులను ముందు పెట్టి బీసీలను ఆకర్షించ ప్రయత్నించింది. అయితే కొద్ది కాలంలోనే బీజేపీలోని ఓబీసీ ఎంపీల సంఖ్య మళ్ళీ తగ్గిపోయింది. ఎంత చేసినా బీజేపీకి కొన్ని రాష్ట్రాలు చేతికి వచ్చాయే తప్ప కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మెజారిటీ రాలేదు.1998 నుంచి 2004 వరకు సంకీర్ణ ప్రభుత్వాలలో భాగమైంది. ఈ దశలో నరేంద్ర మోదీ హిందుత్వ భావజాలానికి జనాకర్షణ నినాదాలను మేళవించి ప్రచారం చేసారు. అయితే ప్రచారార్భాటమే తప్ప ఆ నినాదాలను అమలు చేయలేదు. రాజ్యాంగం ప్రవచించిన లౌకికవాదానికి, అల్ప సంఖ్యాకవర్గాలకు బీజేపీ వ్యతిరేకి అని పుస్తక రచయిత వివరించారు.మోదీ పాలన కొత్త తరహా నిరంకుశత్వంగా మారిపోయిందని పుస్తక రచయిత క్రిస్టోఫ జెఫెలో విశ్లేషించారు. మోదీ ప్రభుత్వం వ్యవస్థలను బలహీనపరిచింది. ఎన్నికల ప్రక్రియను పెడదారి పట్టించింది. మొదట్లో కొన్ని మూకల ద్వారా అల్ప సంఖ్యాకవర్గాలపై దాడులు సాగించేది. తరువాత అధికారికంగానే అల్పసంఖ్యాక వర్గాల వ్యతిరేక వైఖరిని చేపట్టింది.మండల్ కమిషన్ సూచనల అమలుకు వ్యతిరేకంగా ఉన్నత వర్గాలు ఆందోళన చేపట్టాయి. ఈ ఆందోళన తమను అవమానించేదిగా ఉందని భావించిన బీసీలు సమీకృతమయ్యారు. బీసీలు ఉన్నత వర్గాలకు కాకుండా బీసీలకే ఓటేయడం ప్రారంభించారు. దీనివల్ల విద్యావంతులు కానట్టి గ్రామీణ ప్రజాబాహు ళ్యం రాజకీయ రంగంలో ఒక ప్రబల శక్తిగా అవతరించింది.ఇదొక నిశ్శబ్ద విప్లవం.

## రాజధాని సంక్షోభం, రాజకీయ క్రీడలో సర్కారు



అమరావతిలో రాజధాని నిర్మాణాన్ని యథాప్రకారం కొనసాగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చి ఆరు మాసాలు. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు అఫిడవిట్లు దాఖలు చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. దీనిపై నిరంతరం పరిశీలించడానికి వీలుగా కంటిన్యువస్ మాండమస్ కింద అనేక పిటిషన్లు అట్టిపెట్టుకుంది. తీర్పును వైసిపి మినహా అన్ని పార్టీలూ స్వాగతించాయి. తీర్పు ప్రకారం పునరుద్ధరించబడిన సిఆర్‌డిఎ జగన్ ప్రభుత్వం నిర్ణయం మేరకు అక్కడ కొన్నినిర్మాణాలు పూర్తిచేయడానికంటూ అప్పు ప్రయత్నాలు చేస్తున్నట్టు వెల్లడించింది. రోడ్లు, మౌలిక సదుపాయాల నిర్మాణం చేపడతానన్నది. మరోవైపున మూడు రాజధానుల విధానం మారలేదని కూడా చెబుతూ వస్తోంది. ఈ మధ్య కాలంలో రైతులు వేసిన పిటిషన్లు హైకోర్టు ముందుకు వచ్చినపుడు తమ దగ్గర నిధులు లేవనీ, గత మాస్టర్ ప్లాన్‌ను యథాతథంగా పూర్తిచేయడానికి ఈ వ్యవధి చాలదని కోర్టుకు చెప్పింది. తాము గత తీర్పుపై సమీక్ష కోరుతూ ఇక్కడ పిటిషన్ లేదా సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పి వేయనున్నామని తెలియజేసింది. ఈ పూర్వరంగంలోనే రైతులు తమ దీక్షలు వెయ్యి రోజులకు చేరుతున్న సందర్భంగా అమరావతి టు అరసవల్లి యాత్ర చేయడానికి పోలీసుల అనుమతి కోరగా జవాబు రాలేదు. దానిపై వారు కోర్టును అభ్యర్థించగా సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వానికి ఒకరోజు గడువు ఇచ్చింది. సరిగ్గా ఆ రోజు రాత్రే పోలీసులు అనుమతి నిరాకరిస్తూ వారికి నోటీసులు ఇచ్చారు. దాంతో హైకోర్టు అనుమతినిస్తూ తగు భద్రతా ఏర్పాట్లు చేయవలసిందిగా పోలీసులను ఆదేశించింది.

### మరోసారి తీవ్ర వివాదం

రాజధాని సమస్యపై మరోసారి క్రమంగా పెరుగుతూ వస్తున్న వేడి హైకోర్టు అనుమతితో పరాకాష్టకు చేరింది. ప్రజాస్వామ్యబద్దంగా అనుమతి లభిస్తుందని ముందే తెలిసినా జీర్ణించుకోలేని ప్రభుత్వం మళ్లీ మూడు రాజధానుల పల్లవి ఎత్తుకుంది. గతంలో కంటే గట్టిగా తీవ్రంగా మంత్రులు, మాజీ మంత్రులు విశాఖను పాలనా రాజధానిగా చేసి తీరతామని ప్రకటిస్తున్నారు. ఈ తీర్పునకు ముందు రోజే రాజధానికి సంబంధించిన ఒక పుస్తకావిష్కరణ సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పార్టీల నాయకులు, జెఎసి మాట్లాడారు. మిగిలిన అంశాలు అలా వుంచి చంద్రబాబు అమరావతి రాజధాని సంకల్పం తాను ఎందుకు తీసుకున్నానో నొక్కి చెప్పారు. మహానగరం వుంటేనే అభివృద్ధి, ఉపాధి సాధ్యమని పునరుద్ఘాటించారు. తాను రాజధానితోపాటు వివిధ జిల్లాల్లో కేంద్రం ఇచ్చిన సంస్థలు ఏర్పాటు చేయించినట్టు జాబితా ఇచ్చారు. మొత్తంపైన తన ప్రణాళికలోనూ ఆచరణలోనూ లోపం లేనట్టు ఇతరుల వల్లనే ప్రతిష్టంభన వచ్చినట్టు పూర్తిగా సమర్థించుకున్నారు. శంకుస్థాపన సమయంలో ప్రధాని మోడీ మట్టి, నీరు తేవడం కూడా విశిష్టమైన విషయంగా ప్రస్తావించారు. ఆ రోజుల్లో అది తీవ్ర అపహాస్యానికి గురైన సంగతి కావాలనే మర్చిపోయారనుకోవాలి. 1951లో ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమయంలోనూ విజయవాడ రాజధాని కావాలని ప్రయత్నించినా కావాలని అడ్డుకున్న సందర్భాన్ని గుర్తుచేశారు. అమరావతి ఒక కులానికి సంబంధించింది కాదని ఒకవైపు అంటూనే కొందరు వక్తలు ఓ కులం వల్ల సేవలు గొప్పగా లభించినట్టు వ్యాఖ్యానించారు. ఈ సభలో ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారుగానీ గత ప్రభుత్వ జాప్యం, అతిశయోక్తి ప్రచారాలు సింగపూర్ ఆశల వైఫల్యం గురించి కనీస ఆత్మ విమర్శ కనిపించలేదు. మహా నగరాలు చరిత్ర క్రమంలో ఆవిర్భవిస్తాయి. దేశంలోని అయిదు మహా నగరాలలో నాలుగింటికి సుదీర్ఘ చరిత్ర వుంది. ఇప్పటికిప్పుడు ఏర్పడలేదు. హైదరాబాద్ వుంది గనకే ఆయన సైబరాబాద్ విస్తరించారు తప్ప శూన్యం లోంచి కాదు. విజయవాడను రాజధానిగా కమ్యూనిస్టులు చెప్పినప్పుడు వారి గురించిన భయంతోనే అప్పటి పాలక వర్గాలన్నీ కలిసి అడ్డుకున్నాయి. ఆ ఘట్టాన్ని అమరావతితో పోల్చి మాట్లాడ్డం వాస్తవికత కాదు. కనుక చంద్రబాబు చెప్పే దాంట్లో ఇప్పటికైనా వాస్తవికత లేదు. అప్పుడూ ఇప్పుడూ కేంద్ర బిజెపి అవకాశవాదాన్ని, అలక్ష్యాన్ని కనీసంగా మాట్లాడక పోగా వారి మాజీ అధ్యక్షుడిని పిలిచి మరీ పీట వేశారు. ఈ కారణంగానే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఈ సభలో మాట్లాడతారని ప్రకటనలో వున్నా ఆయన హాజరు కాలేదు. రాజధానిపై పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు, అంతకు మించి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజధాని దుస్థితికి కారణమని సూటిగా విమర్శ చేశారు. హైకోర్టు తీర్పును అమలు చేసి రాజధానిని పూర్తి చేయాలన్నారు.

### ప్రభుత్వ పెడ ధోరణి, మంత్రుల ఎదురు దాడి

ఈ తీర్పు వచ్చిన రోజున సమావేశమైన మంత్రివర్గం సిఆర్‌డిఎ చట్టానికి కొన్ని సవరణలు ప్రతిపాదించింది. రాజధానిలో భూములిచ్చిన రైతులకు మాత్రమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చెబుతున్న నిబంధనను సవరించి ఇతర ప్రాంతాల వారికి కూడా అవకాశం వుండేలా చేస్తామన్నది. అమరావతి మెట్రో అథారిటీగా గతంలో ప్రకటించికోర్టు తీర్పుతో వెనక్కు తగ్గిన పరిస్థితి పోయి మునిసిపాలిటీ చేస్తామన్నది. దీనిపైనా పదిరోజుల్లో గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకోవాలని కార్యక్రమం ప్రకటించింది. 29 గ్రామాలలో కొన్నిటిని మినహాయించింది. రాజధానిని మునిసిపాలిటీ స్థాయికి తెచ్చారని విమర్శలు రాగా రాజధానులైన ముంబాయి, కోల్‌కతా, మద్రాసు వంటి మహా నగరాలకు కూడా కార్పొరేషన్లు వున్నాయని ఎదురుదాడి చేసింది. అంతకన్నా కీలకంగా మంత్రులు మూకుమ్మడిగా విశాఖ పాలనా రాజధానిగా మూడు రాజధానులు చేసి తీరతామని ప్రకటించారు. మొత్తం నిధులు ఒకచోటే పెడితే మిగతా ప్రాంతాలు ఏం కావాలని ఎదురు ప్రశ్నలు వేశారు. టిడిపి, వైసీపీ దూషణలు పక్కన పెడితే వికేంద్రీకరణ కోసమే ఇదంతా చేస్తున్నట్టు ప్రభుత్వం వాదించింది. ప్రభుత్వం పైన, తన కుటుంబంపైనా దాడి చేస్తున్నా మంత్రులు స్పందించడం లేదని ముఖ్యమంత్రి జగన్ మంత్రివర్గ సమావేశంలో ఆగ్రహం వెలిబుచ్చిన నేపథ్యంలో వీరు అవసరాన్ని మించి మరీ ఆవేశకావేశాలు ప్రదర్శిస్తున్నారు. గతంలో ఈ శీర్షికలో చెప్పుకున్నట్టుగా దీన్ని రాజకీయ వివాదంగా ప్రాంతీయ ఎజెండాగా చేసే ప్రయత్నం ప్రస్ఫుటమవుతున్నాయి. అమరావతిలో నిజంగా జరిగిన నష్టం చక్కదిద్ది రాజధానిని పూర్తిచేసే బదులు వివాదాన్ని సాగదీయడమే వారి లక్ష్యంగా అర్థమవుతుంది. మూడు రాజధానులనకుండానే విశాఖలో కీలకమైన కొన్ని కార్యాలయాలు, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం పెట్టి పరిశ్రమల ఒప్పందాల కేంద్రంగా చూసుకుంటారని వచ్చిన సూచనలు వెనక్కుపోయాయి.

### అమరావతి దురవస్థ, హైకోర్టు తీర్పు

అమరావతిలో రాజధాని నిర్మించడం కోసం శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అందుకోసం ఎపిసిఆర్‌డిఎను నెలకొల్పింది, అభివృద్ధి చేసిన ప్లాట్లు, వాణిజ్య ప్లాట్లు కేటాయించడం, కౌలు ఇవ్వడం ప్రాతిపదికగా రైతుల నుంచి 34 వేల ఎకరాలు సేకరించింది. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామనీ, పదేళ్ల నాటికి ప్రపంచ స్థాయి నాణ్యతతో దాన్ని పెంపొందిస్తామని మాట ఇచ్చింది. ఎపిసిఆర్‌డిఎ 9.14 కింద జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిఎ) చేసుకుని ఆ భూమిని స్వాధీన పర్చుకుంది. కాని ఇప్పటికీ వారికి ప్లాట్లు అప్పగించడం పూర్తికాలేదు. మౌలిక సదుపాయాలు, భవనాల నిర్మాణం జరగలేదనీ హైకోర్టు పేర్కొంది. మూడు రాజధానుల విధానంతో ప్రామిసరీ ఇస్టోపిల్ సూత్రం ప్రకారం సిఆర్‌డిఎ ప్రభుత్వం చేసిన వాగ్దానం భగమైంది. తన చేతిలో శాసనాధికారం వుందని ఇష్టానుసారం దుర్వినియోగం చేసి ఒప్పందం కట్టుబాటును ఉల్లంఘించకూడదు. ఈ ఏడేళ్లలో వివిధ రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాల కోసం ఇంచుమించు 15 వేల కోట్లు ఖర్చు అయింది. అర్ధంతరంగా వదిలివేయడంతో ఆ ప్రజాధనం వృథా అవడమే గాక భూములిచ్చిన రైతుల జీవనోపాధి దెబ్బతినిపోయింది. ఆస్తిహక్కుకు విఘాతం కలిగింది. సుక్షేత్రాలయిన వారి భూములు పడావు పడ్డాయి. అభివృద్ధి పనులులేక ఈ ప్రాంతం వెనకబడిపోయింది. రాజ్యాంగం లోని 21వ అధికరణం కింద జీవించే హక్కుతో సహా ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే. అమరావతిని శాసన రాజధానిగా పరిమితం చేసేట్టయితే భూసమీకరణ ఒప్పందం ప్రకారం ఆర్థిక లబ్ధి గాని జీవనోపాధి గాని లభించవు. ఇప్పుడు ఆ బిల్లును వెనక్కు తీసుకున్నాము గనక విచారణ అవసరం లేదని ప్రభుత్వం, సిఆర్‌డిఎ వాదిస్తున్నా భవిష్యత్తులో తెచ్చే వికేంద్రీకరణ శాసనం ఎలా వుంటుందో తెలియకుండా కేసు విచారణ ఆపలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాజధాని ఎక్కడ పెట్టాలో తాము చెప్పడంలేదని కూడా స్పష్టం చేసింది. ఎపిసిఆర్‌డిఎ చట్టం, 9.14 జిపిఎ ప్రకారం అమరావతిలో గతంలో అనుకున్న విధంగానే రాజధానిని నిర్మించాలని, ఏ కార్యాలయాన్ని ఏ విభాగాన్ని ఎక్కడికి తరలించరాదని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఇప్పుడు మంత్రుల తాజా ప్రకటనలతో మూడు రాజధానుల సమస్య మళ్లీ ముందుకు వచ్చింది.

### గత అనుభవాలు, భవిష్యత్తు

ముందే చెప్పినట్టు ఈ దుస్థితికి గత ప్రస్తుత ప్రభుత్వాలు, అంతకు మించి కేంద్రం బాధ్యత వహించాల్సి వుంటుంది. తెలుగుదేశం హయాంలో మొదటి జాప్యం జరిగింది. దాంతో కలిసి రాష్ట్రాన్ని పాలించిన, ఇప్పటికీ కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి మరింత అన్యాయం చేసింది. మూడు రాజధానుల ముచ్చటతో ప్రస్తుత ముఖ్యమంత్రి మొత్తం తలకిందులు చేశారు. ఫలితంగా ఎనిమిదో ఏట కూడా రాజధానిపై అస్పష్టత ఆందోళన కలిగిస్తుంది. నష్టం చేస్తుంది. ఇప్పటికైనా దాన్ని ముగించడం ప్రభుత్వాల బాధ్యత. వికేంద్రీకరణ తప్పనిసరిగా జరగాల్సిందే. ఆ పేరుతో కట్టాల్సిన రాజధాని నిలిపేయడం ఏం న్యాయం? దానిపై ఆందోళనలను అడ్డుకోవడం ఎంత అప్రజాస్వామికం? రాజధానిలో దళితులకు భూములివ్వడం బాగానే వుందిగాని ముందు కడితే కదా, మేలు జరిగేది? కట్టిన భవనాలు పూర్తిచేయకుండా మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఎవరికి ఇళ్ల స్థలాలు ఇస్తే ఏం లాభం? జగన్ ప్రభుత్వ వాదనలు, వ్యూహాలు సమర్థనకు, ఎదురుదాడికి మాత్రమే...విశాఖతో సహా ఉత్తరాంధ్రను కర్నూలులో హైకోర్టుతో సహా రాయలసీమను అభివృద్ధి చేస్తే ఎవరు కాదంటారు? వాటికోసం అమరావతి నిలిపివేయడం ఎందుకనేదే ప్రశ్న. స్వయంకృతాపరాధమైన ఈ సంక్షోభాన్ని ప్రజాస్వామికంగా పరిష్కరించకపోతే పాలక పక్షానికే నష్టం. దాన్ని ప్రాంతీయ వివాదంగా మార్చి లాభం పొందాలనుకుంటే అప్పుడు ఈ విభజిత రాష్ట్రానికి మరింత చేటు. ఇప్పటికైనా అందరితో చర్చించి వాస్తవిక రాజధాని నిర్మాణం జరిపితేనే ప్రజలు హర్షిస్తారు.

## ఇక తాడో... పేడో...



ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నిర్ణయం తీసుకుని, రాహుల్ ఆధ్వర్యంలో భారత దేశ యాత్ర చేపట్టింది. ఇంతవరకూ అధినేత రాహుల్ గాంధీ దశాబ్దమున్నర కాలంగా అప్పుడప్పుడూ మెరుపు యాత్రలు, విహార యాత్రలు చెయ్యడం తప్పించి సీరియస్ గా ప్రజలతో నడిచింది లేదు. ఇప్పుడు కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాకా 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్ని స్పృశిస్తూ ఐదునెలల పాటు, 3500 కిలోమీటర్లు పాదయాత్రకు బయలుదేరడం అభినందనీయం. తద్వారా ప్రజల సమస్యలేమిటో ప్రత్యక్షంగా చూడడం అన్న ప్రాథమిక బాధ్యత నెరవేరుతుంది. వాటిపై ఒక రాజకీయ పార్టీగా ఎలా స్పందించాలి, తాము చూపించే పరిష్కార మార్గాలేమిటి అన్నవి ఎంచుకోవడం తదుపరి బాధ్యత. వాటిని ప్రజలెంత వరకూ నమ్మారు, ఎంత ఆమోదించారు అన్న వాటిపై ఆ పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉంది. ప్రజలు పూర్తి విశ్వాసం కనపర్చినా వాటిని వోట్ పవర్‌గా మార్చుకోవడం, అలా మార్చుకోగల పటిష్టమైన పార్టీ నిర్మాణం చేసుకోవడం ఇంకో రాజకీయ గమ్యం ఆ పార్టీకి. ఏదైనా ప్రజలకు చేరువ కావడం ప్రాథమిక అంశం కాబట్టి ఆ దిశగా ఆ పార్టీ చేస్తున్న ఈ బృహత్ ప్రయత్నాన్ని అభినందించాల్సిందే. ఎందుకంటే ఆ పార్టీ బలపడడం ఆ పార్టీకే సంబంధించిన వ్యవహారం కాదు. దేశానికి కూడా మేలు చేసే కార్యక్రమం. రాష్ట్రాల వారీగా బలమైన ప్రాంతీయ పార్టీలు ఎక్కువగానే ఉన్నా, జాతీయ స్థాయిలో బీజేపీ కి సవాల్ చేసే స్థాయి పార్టీలు లేవు. దేశానికి బలమైన స్థిరమైన అధికార పక్షం ఎంత అవసరమో, బలమైన ప్రతిపక్షం కూడా అంతే అవసరం. ఒకప్పుడు తిరుగులేని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఎక్కడా తిరగలేని పార్టీగా మిగిలింది. ప్రజల నుండి దూరమై, నాయకత్వలేమి తో కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. అయినా దేశ వ్యాప్తంగా ఆ పార్టీ ఎంతో కొంత గుర్తింపుని కలిగే ఉంది. కాబట్టి ఆ పార్టీ బలపడితే జాతీయ స్థాయిలో దీటైన ప్రత్యామ్నాయం కాలేకపోయినా, అలాంటి ప్రాంతీయ ప్రత్యామ్నాయాల్ని కలిపి ఉంచగల శక్తిగా ఉంటుంది. ఆరోగ్యకర ప్రజాస్వామ్యానికి అవసరం ఇది.

## అభివృద్ధి పథంలో బస్వాపురం పంచాయతీ..

### అభివృద్ధికి సర్పంచ్ లక్ష్మీనారాయణ ప్రత్యేక శ్రద్ధ..



తల్లాడ, సెప్టెంబర్ 12 (ప్రజా పాలన న్యూస్):తల్లాడ మండలంలోని బస్వా పురం గ్రామపంచాయతీ అభివృద్ధి పదంలో ముందుకెళ్తుంది. గ్రామ సర్పంచ్ సూరంపల్లి లక్ష్మీనారాయణ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, వర్షాకాలం సీజన్ కావడంతో పారిశుద్ధ్య పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు దోమల మందును పిచికారి చేయించడం, గ్రామపంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్యన్ని మెరుగుపరచటం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనాన్ని సుందరగా తీర్చిదిద్దారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూరంపల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు.

## దండుమైలారంలో శోభాయమానంగా గణేష్ నిమజ్జనోత్సవం



ప్రత్యేక ఆకర్షణగా పూణె బ్యాండ్ -1.15000 పలికిన లడ్డూ వేలం

ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ తేదీ 12 ప్రజాపాలన ప్రతినిధి : దండుమైలారం గ్రామంలోని చారిత్రాత్మక పురాతన శివాలయంలో ప్రతిష్టించిన గణపతి నిమజ్జనోత్సరం నిన్న( 11 - 09-2022 ) రోజున జరిగింది . పూణె ( మహారాష్ట్ర) నుండి వచ్చిన బ్యాండు బృందం నిమజ్జనోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 50 మందితో కూడిన బ్యాండ్ బృందం కాషాయ ధ్వజం తో నృత్యాలు చేస్తూ ముందుకు సాగుతుండగా గ్రామ భజన బృందం భక్తి గీతాలతో ఆధ్యాత్మిక శోభను తెచ్చారు. గ్రామ దేవాలయంలో ప్రతిష్టించిన గణనాథుడు నిమజ్జనానికి భయలుదేరిన సమయంలో ప్రతి ఇంటినుండి మహిళలు మంగళ హారతులు సమర్పించి ప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ప్రధాన కూడలిలో నిర్వహించిన లడ్డూ వేలంలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడానికి పెద్ద ఎత్తున ప్రజలు పోటీపడ్డారు గ్రామానికి చెందిన వెంకటాచారి 115000( ఒక లక్షా పదిహేను వేలు ) రూపాయలకు వేలంలో లడ్డూను పొందగా ఆలయ ధర్మకర్త రావినూతల వంశీధర్ వేద మంత్రోచ్చరణ మధ్య లడ్డూ ప్రసాదాన్ని అందించి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక కుటుంబ సభ్యులు మరియు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి రావినూతల శశిధర్, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ మెంబర్లు , వార్డు మెంబర్లు, భజన బృందం సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు , ముఖ్యంగా గ్రామంలోని వివిధ యువజన సంఘాల సభ్యులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు, ఇబ్రాహింపట్నం పోలీసులు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేసి నిమజ్జనోత్సవం విజయవంతంగా జరిగేలా సహకరించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానించిన పొంగులేటి, కోట రాంబాబు



మధిర రూరల్ సెప్టెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో సోమవారం నాడు పలు కార్యక్రమాల్లో భాగంగామధిర, ఎర్రుపాలెం పర్యటనలో ఉన్న మాజీ ఎంపీ శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధిర మండలం పర్యటనలో మాటూర్ తెరాస నాయకులు గ్రామ సర్పంచ్ వేడిశెట్టి లీలావతి, నాగేశ్వరరావు, ఎంపీటీసీ అడపాల వెంకటేశ్వర్లు,తెరాస కపిలవాయి సత్యనారాయణ రాజుల సూచన మేరకు జిల్లా కలెక్టర్ చే 2022 ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మాటూర్ హైస్కూల్ గణితోపాధ్యాయులు శ్రీ మేడేపల్లి శ్రీనివాసరావును మాటూర్ హైస్కూల్ కి వెళ్లి అభినందనలు తెలియజేస్తూ పూలమాల, దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం డా రాంబాబు అవార్డ్న గ్రహీత మేడేపల్లి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. కఠినమైన గణితాన్ని భోదిస్తూ మంచి ఫలితాలు సాధించినందుకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్ లో ఇంకా ఎక్కువ అవార్డులు సాధించాలని పొంగులేటి సూచించారుఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా,మండల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిరసన దీక్ష చేపట్టిన జనంపల్లి అనిరుద్ రెడ్డి











ప్రజా పాలన. ప్రతినిధి. సెప్టెంబర్. 12 నవాబు పేట్ మండల కేంద్రంలో సరైన లబ్దిదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా సరిగ్గా పింఛను ఇవ్వలేని ప్రభుత్వాన్ని కూల్చేద్దాం అని జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సమన్వయకర్త అనిరుద్ రెడ్డి అన్నారు. సోమవారం నవాబ్ పేట మండల కేంద్రము లో అంబేద్కర్ చౌరస్తాలో ఒక రోజు నిరాహార దీక్ష చేస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన ఎనిమిది సంవత్సరాల పాటు తన కుటుంబ సభ్యుల సంపాదన మాత్రమే పెంచుకున్నారు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేవు అని అన్నారు.ప్రజలు ఇకనైనా మారండి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలకమైన పాత్ర పోషించింది అని అన్నారు.తల్లి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు అని అన్నారు.ఆంధ్రాపాలకుల విముక్తి కోసం పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ దొరల పాలన గా మారింది అని వాపోయారు.ఎన్నికలలో ఇచ్చిన హామీలను మరిచి కమీషన్ల కోసం ప్రాజెక్టు ద్వారా కోట్ల రూపాయల దుర్వినియోగం చేయడమే వారి లక్ష్యం అని అన్నారు.ఇళ్ళులేని నిరుపేద కుటుంబానికి రెండు పడకల ఇళ్ళు కట్టిస్తామని, దళితులకు మూడు ఎకరాల భూమిని మరిచిపోయారు అని అన్నారు దళిత బంధు, రైతు బంధు పతకాలు పేదలకు ఒరిగేదేమీ లేదు అని అన్నారు.రైతులకు రుణాలు మాఫీ చేస్తామని మోసం చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేద్దాం అని అన్నారు.టీఆరెస్ నాయకుల రియల్ ఎస్టేట్ వ్యాపారంతో గ్రామాలలో పేద రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. ప్రజలకు మెరుగైన విద్య ,వైద్యం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్. జడ్చర్ల కాంసెన్సీ కాంగ్రెస్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మీనాక్షి . యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసు యాదవ్. ప్రధాన కార్యదర్శి మల్లేష్ .నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువత ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు. మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఆకుల అమరేశ్వర్. యంపీటీసీలు తులసీ రాం. నర్సింహులు. నవాజ్ రెడ్డి. కొల్లూరు గ్రామ ఉప నర్సింహ చారి. వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### ఎబ్బనూర్ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి



వికారాబాద్ బ్యూరో 12 సెప్టెంబర్ ప్రజా పాలన : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎబ్బనూరు గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం ధారూర్ మండల పరిధిలోని ఎబ్బనూర్ గ్రామంలో వీధి వీధి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎబ్బనూర్ గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలోని పలు పరిసరాలను మోరీలను, కాలువలను లోతట్టు బావులను ఆయన పరిశీలించారు. దోమలపై దండయాత్ర చేస్తున్నామని స్పష్టం చేశారు. పరిసరాలను అపరిశుభ్రం చేయకుండా ప్రతి కుటుంబం వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ట్రాక్టర్ల ద్వారా వ్యర్థ పదార్థాలను తరలించి, దోమల ఉత్పత్తి జరగకుండా, దుర్వాసన వేదజల్లకుండ, ఊరికి దూరంగా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్నామని వివరించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు శానిటేషన్ పనులు చేపిస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు, వ్యాక్సిన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ గ్రామ పంచాయతీ ప్రజల అరోగ్య భద్రతకు ఎనలేని కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి నెల రెండో వారంలో వాటర్ టాంక్ ను ,వీధిలో మోరిలు, కాలువలు శుభ్రం చేపించి శానిటేషన్ లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ, దోమల సమూల నిర్మూలన దిశగా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. ప్రస్తుత వర్షా కాలంలో సీజనల్ వ్యాధులతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హితవుపలికారు. దోమల బెడద నుండి తప్పనిసరిగా దోమతెరలు వాడాలని నివాస ప్రాంతాలకు సమీపంలో వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు . డెంగ్యూ మలేరియా అతిసార వైరల్ ఫీవర్ తదితర సీజనల్ వ్యాధులు తలెత్తకుండా గ్రామంలో గట్టి నివారణ చర్యలు చేపట్టామనీ వెల్లడించారు. ఈ కార్య క్రమంలో భాగంగా ఉప సర్పంచ్ అరుణ గోపాల్, గ్రామ సెక్రటరీ రాజేష్ ,టిఆర్ఎస్ పార్టీ ఉప అధ్యక్షులు రహీమత్ , మొదటి వార్డ్ మెంబెర్ ప్రశాంత్ , రాజు , శ్రీనివాస్ గౌడ్, రాంచెంద్రయ్య, అనంతయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యూనివర్సిటీ లో అడ్మీషన్ కొరకు విద్యార్థుల అవస్థలు







హైదరాబాద్ 12 సెప్టెంబర్ ప్రజాపాలన: డిగ్రీ, పిజీ కోర్సుల్లో ప్రవేశం కొరకు అంబెద్కర్ యునివర్సిటీ విద్యార్థుల పాట్లు. యునివర్సిటీ లో ఇంటర్ నెట్ సరిగా పనిచేయక పోవడంతో విద్యార్థులు ప్రవేశం కొరకు అప్లై చేసుకున్నా వెరిఫికేషన్ కోడ్ మెసేజ్ రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు వరుసగా సెలవులు రావడంతో దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పిజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ సమీపంలో ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. యునివర్సిటీ లోని మీ సేవ కేంద్రంలో మరియు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కౌంటర్ లో విద్యార్థులు బారులు తీరారు. సమయం వృధా అవుతుందని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసాలకు ఓర్చి యునివర్సిటీ కి వచ్చినా సకాలంలో పని జరుగక పోవడంతో అధికంగా ఖర్చుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వికలాంగులు మహిళలు దూరప్రాంతాల నుంచి వచ్చి అడ్మీషన్ కొరకు లైన్ లో అవస్థలు పడుతున్నారు. అన్ని స్టడీ సెంటర్ల లో ఇదే తీరు ఉందని విద్యార్థులు అంటున్నారు. అడ్మీషన్ విషయం లో స్టడీ సెంటర్ల కు ఎన్ని సార్లు ఫోన్ చేసినా మీ అప్లికేషన్ ను అనుమతించాం ఫీజు పే చేయవలసింది గా సమాధానం చెబుతున్నారు.అడ్మీషన్ ఫీజు పే చేయాలని వెబ్ సైట్ లో చూస్తే ఇన్ వాలీడ్ అప్లికేషన్ అని కనిపిస్తుంది. యస్.ఎమ్. ఎస్. రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. యునివర్సిటీ అధికారులు వెంటనే స్పందించి ఈ విషయం లో విద్యార్థుల ఇక్కట్లను తొలగించాలని అవసరం అయినప్పుడు ఎక్కువ కౌంటర్లను తెరవాలని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు.

## పెండింగ్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలి



మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 12, ప్రజాపాలన: పెండింగ్ స్కాలర్షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ సోమవారం రోజున జిల్లా కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కాంట్రాక్టులు,వాటి కమిషన్ల మీద ఉన్న ప్రేమ విద్యార్థుల మీద లేదని గత రెండు సంవత్సరాలుగా విద్యార్థులకు చెల్లించాల్సిన 3000 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకపోవడంతో ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్కాలర్షిప్లు రాకపోవడం తో యాజమాన్యాలు విద్యార్థులను సర్టిఫికేట్ల విషయంలో వేధిస్తున్నాయని అన్నారు దీంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేక మనస్థాపానికి గురవుతున్నారని, తెలంగాణ ప్రభుత్వం పేదల చదువు విషయంలో కేవలం హామీలు ఇస్తూ ఆచరణ విషయంలో మాత్రం శ్రద్ధ చూపెట్టడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విజయ్, మాధవ్,మహేష్,రాజ్ కుమార్,హైమద్,శ్రావణ్, శిరీష్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మోరంగపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మృతి: వికారాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్



వికారాబాద్ బ్యూరో 12 సెప్టెంబర్ ప్రజా పాలన : గుర్తు తెలియని వ్యక్తి సదాశివపేట రోడ్డు రైల్వే స్టేషన్ ( మొరంగపల్లి ) వద్ద కిలోమీటర్ నంబర్ 21/12-13 మధ్యన ఏదో గుర్తు తెలియని రైలు క్రిందపడి చనిపోయాడని వికారాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘటన స్థలంలో మృతుని చిరునామాకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు.మృతుని యొక్క వయస్సు సుమారుగా 25 సంవత్సరాలు ఉండవచ్చని అంచనా వేశారు. చనిపోయిన వ్యక్తి చామన ఛాయ, కోల ముఖం కలిగి ఉన్నాడు. కొద్దిగా గడ్డం కలదు. ఎత్తు 5'.5" అంగుళాలు. చనిపోయిన వ్యక్తి బ్లూ కలర్ నైట్ ఫ్యాంట్. చాక్లెట్ రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడు . మృతుని యొక్క మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి, మార్చురి నందు భద్రపరచడం జరిగినది. ఇట్టి సంఘటన ను అనుసరించి సిఆర్ నంబర్ 86/2022 నమోదు చేసి యు/ సెక్షన్ 174 సిఆర్ పిసి ప్రకారం దర్యాప్తు చేపట్టడం జరిగింది. మృతునికి సంబంధించి అతని యొక్క సమాచారం/ఆచూకీ తెలిసిన యెడల, స్టేషన్ హౌస్ ఆఫీసర్, రైల్వే పోలీసు స్టేషన్, వికారాబాద్ కు సమాచారం అందించగలరని కోరారు. ఇతర వివరాలకు 9440627527 ఫోన్ సంప్రదించాలి.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 12, ప్రజాపాలన: పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం రోజున లక్షెట్టిపేట్ మండల విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు రబియా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందని, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ప్రభుత్వం చెల్లించే బిల్లులు సరిపోవడం లేదని, కోడి గుడ్డును ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని , ఆరోగ్య భద్రత ,10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా, పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ప్రతి విద్యార్థికి 15 రూపాయల చొప్పున బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పలు సమస్యల ను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, మల్లవ్వ, రజిత, ఎల్లవ్వ, పెద్ద మల్లవ్వ పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ ప్రకటన పట్ల హర్షం..



తల్లాడ, సెప్టెంబర్ 12 (ప్రజాపాలన న్యూస్):పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ తీసుకున్న నూతన నిర్ణయాన్ని ఉపసంహరించుకొని పాత పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమ ఫలితంగా సీఎం కేసీఆర్ ప్రకటన పట్ల విజయం సాధించామని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, దశరథ నాయక్, మూకర ప్రసాద్ తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ తల్లాడలో ర్యాలీ జరిపి బాణసంచా పేల్చి విజయదరహాసం వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ ఎస్టీ బీసీలకు కటా ఫ్ మార్కుల కల్పిస్తామని ప్రకటించడం హర్షనీయమని ఇది ఉద్యమకారుల విజయమని ఈ విజయ స్ఫూర్తిని భవిష్యత్తులో కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇసినేపల్లి అశోక్, అద్దంకి వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, మేడి శ్రీను పాల్గొన్నారు.

# వడ్డేరుల వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 12 ప్రజా పాలన ప్రతినిధి :వడ్డెర వృత్తిదారులకు లోన్లు ఇవ్వాలని వడ్డెర వృత్తి దారుల సంఘం సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు విగ్నేష్ మాట్లాడుతూ సమాజంలో అత్యంత ముఖ్యమైన వృత్తులలో వడ్డెర వృత్తి కూడ ఒకటి. ప్రాచీన కాలం నుండి ఈ వృత్తికి ఎనలేని ప్రాధాన్యత ఉంది. గ్రామీణ ముఖ్య వృత్తిల్లో వడ్డెర వృత్తిదారులు నేడు రాయి పని, మట్టి పని, కంకర పని, కంప్రీషన్, కాంట్రాక్టర్ పనులతో పాటు నిర్మాణ రంగంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ వృత్తిలోకి అనేక కార్పోరేట్ కంపనీలు ప్రవేశించి, వేల కోట్ల రూపాయాలు ఆశిస్తున్నాయి. కానీ తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న వడ్డెర వృత్తిదారులు మాత్రం ఇంక పేదరికంలోనే మగ్గుతున్నారు. విద్య లేకపోవడం వల్ల పేదరికం, వెనుకబాటు తనం కారణంగా వృత్తిలో వచ్చే మార్పులను అందిపుచ్చుకోలేక పోతున్నారని అన్నారు. తద్వారా వడ్డెర వృత్తిదారులు మరింత దారిద్రంలోకి నెట్టివేయబడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2014 లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 14 లక్షల కుటుంబాలకు పైగా వడ్డెరలు ఉన్నారని అన్నారు. నూటికీ 80 శాతం మంది వడ్డెర వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. దీంతో 95 శాతం మంది అత్యంత వెనుకబడి వున్నారన్నారు. వృత్తి పరంగా ఎలాంటి ఆర్థిక పరమైన పెరుగుదల లేకపోవడం వలన అన్ని విధాలుగా సమాజంలో వెనుకబాటు తనం, అణచివేతకు, దోపిడికి, వివక్షతకు, గురవుతున్నారు. తద్వారా అవకాశాలను అందుకోలేక పోతున్నారని అన్నారు. దళిత బంధు మాదిరిగా వడ్డెర బంధు ప్రకటించి వెనుకబడిన ప్రతి కుటుంబాన్నికి 10 లక్షలు కేటాయించి అభివృద్ధి చేయ్యాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో వెనుకబడిన వడ్డెర వృత్తిదారుల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయ్యాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన వడ్డెర వృత్తిదారులకు 3000 వేల రూపాయాల ఫీంఛన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ పనుల్లో 30 శాతం పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుట్టలపై,కార్వీలపైన పూర్తి హక్కులు వడ్డెరలకే ఇవ్వాలని,వడ్డెర ఫేఢరేషన్ కు 3000 వేల కోట్లు కేటాయించి, సొసైటీలకు ఎలాంటి షరత్తులు లేకుండా బ్యాంకులు లోన్లు ఇవ్వాలని కోరారు.వడ్డెర వృత్తిదారులకు ప్రమాదవశాత్తు మరణిస్తే 25 లక్షలు రూపాయల ఎక్స్‌క్షియ ఇవ్వాలి శాశ్విత అంగవైకల్యం చెందిన ప్రభుత్వం 15 లక్షల రూపాయలు ఎక్స్‌షియా ఇవ్వాలన్నారు. వడ్డెర వృత్తిదారులకు ఢబల్ బెడ్ రూమ్స్, ఇండ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం.వెంకటకృష్ణ, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దేరంగుల రామకృష్ణ మరియు జిల్లా నాయకులు గండికోట నరసింహ, దేరంగుల.నిఖీల్,రాజు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల వల్లే ఉత్తమ అవార్డు రావడం నా అదృష్టం



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ తేదీ 12 ప్రజాపాలన ప్రతినిధి : ఆదిభట్ల మున్సపల్ సోమవారం రోజున ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్కళ పర్మేష్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు ఎంపికైన సందర్భంగా ఉపాధ్యాయ ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించరు కార్యక్రమంలో ఏఈ ఇంద్రసేనారెడ్డి మరి నిరంజన్ రెడ్డి అని ఉపాధ్యాయులు అధ్యక్షతన జరిగింది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రసంగిస్తూ ఉపాధ్యాయుల కు అవార్డు రావడం గర్వకారణం అని ఉపాధ్యాయుల పద్మావతి పాల్గొన్నారు.

## మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి విస్తృత పర్యటన



బోనకల్, సెప్టెంబర్ 12 ప్రజా పాలన ప్రతినిధి: టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా రావినూతల గ్రామంలో జడిపూడి సైదమ్మ కుమారులు నాగేంద్రకుమార్, ఫణికుమార్ లు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించినారు.అలాగే చేబ్రోలు సీతమ్మ ఇటీవల చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయాలను అందజేశారు. పెద్దబీరవల్లి గ్రామంలో చింతల చెర్వు వీరభద్రం దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలు వేసి నివాళ్లర్పించారు. బ్రాహ్మణపల్లిలో ఇటీవల మరణించిన దారగాని ప్రభాకర్, జెర్రిపోతులు ఆనందరావు, డెరాల మంగమ్మ, గాదె వెంకటరెడ్డి కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆర్థిక సాయం ను అందజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలకృష్ణారెడ్డిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా వారు అనారోగ్యం నుంచి కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి, జిల్లా నాయకులు బొమ్మెర రామ్మూర్తి, స్థానిక సర్పంచ్ లు సైదానాయక్, చిలకా వెంకటేశ్వర్లు, మందడపు తిరుమలరావు, జెర్రిపోతుల రవీందర్, కొమ్మినేని ఉపేందర్, తొండపు వేణు, పార్టీ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లిఖార్జున్, ఉమ్మినేని కృష్ణ, గాదె సర్వోత్తమ రెడ్డి, తమ్మారపు బ్రహ్మం, సాధినేని రాంబాబు, కన్నెటి సురేష్, గొడుగు కృష్ణ, బి. మురళి, భాగం నాగేశ్వరరావు, తోటకూర వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, ప్రదీప్, వెనిగండ్ల మురళి, బీరెల్లి కృష్ణ, కొరివి సురేష్, చిలకా నాగరాజు, కటారి నాగేశ్వరరావు, చంద్ర కృష్ణ, ఇరుగు నాగభూషణం, వంగాల కృష్ణ, మామిళ్ల కృష్ణయ్య, చింతలచెర్వు లక్ష్మినారాయణ, కొడాలి గోవిందరావు, వట్టికూటి సైదులు గౌడ్, గుడిపూడి రజనీకాంత్, ఎయిర్ టెల్ నరసింహారావు, ప్రవీణ్, చావా లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | - | పాలేరు | - | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | - | మయూర్ సెంటర్ | - | 9160400339 |
| మాలేడు నరేందర్ | - | ఖమ్మం రూరల్ | - | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | - | ఖమ్మం టౌన్ | - | 9948327333 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | - | ఎర్రుపాలెం మండలం | - | 8501020885 |
| బుక్యా.శ్రీను | - | బోనకల్ | - | 8688810293 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9000178307 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | - | కొడంగల్ | - | 9866027635 |
| టి.సురేష్ చారీ | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| డి.భాస్కర్ | - | బెల్లంపల్లి | - | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | - | జన్నారం రూరల్ | - | 9493314399 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| గొడ్లబాబూరావు | - | తల్లాడ | - | 9848236015 |


## టిఆర్ఎస్ లోనే ఉంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా



మధిర సెప్టెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలో ముందుగా ఏ ఎన్నికలు జరిగినా ఆ ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేస్తానని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మధిరలోని డాక్టర్ కోటా రాంబాబు నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా తాను పోటీలో ఉంటానని ఆయన అన్నారు. ప్రస్తుతం తాను టిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నందున ఆ పార్టీ నుండి రాబోయే ఎన్నికల్లో పోటీలో ఉంటానని ఈ సందర్భంగా ఆయన నొక్కి వక్కాణించారు. తాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి రాజకీయ జీవితాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజల ఆశీస్సులతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గెలుపొందటం జరిగిందని ఆయన గుర్తు చేశారు. తర్వాత రాష్ట్రం విడిపోవడం తెలంగాణ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లేకపోవడంతో ముఖ్యమంత్రి కెసిఆర్ సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరి పని చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో పాదయాత్ర చేసే అవకాశం ఉందా అని విలేకరుల ప్రశ్నించగా, నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నారని, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని అదే సమయంలో అధికార పార్టీలో ఉండి పాదయాత్ర చేయటం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి డాక్టర్ కోటా రాంబాబు పెదమర్తి రవి బొమ్మెర రామ్మూర్తి యన్నం కోటేశ్వరరావు వేమిరెడ్డి లక్ష్మారెడ్డి చావలి రామరాజు ఎర్రగుంట రమేష్ బొబ్బిళ్ళపాటి బాబురావు అక్కినపల్లి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాంపేటలో లడ్డు కైవసం చేసుకున్న యాచారం శివ



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ తేదీ 12 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మున్సిపల్ సీతారాంపేట్ గ్రామంలో చౌరస్తా యూత్ అసోసియేషన్ సభ్యులు కౌన్సిలర్ శ్రీలత రాంబాబు ఆధ్వర్యంలో వినాయకుడి పూజలో నిర్వహించి తొమ్మిది రోజుల నవరాత్రుల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించి దర్శించుకున్నారు భక్తులు తొమ్మిది రోజులు లడ్డు పూజలు నిర్వహించి లడ్డు వేలం పాట లోబాగంగ గ్రామంలో పెద్దల సమీక్షంలో వేలపాట కొనసాగించి వేలపాట లో లడ్డును 42 400 రూపాయలకు కైవసం చేసుకున్న యాచారం శివ మహా ప్రసాదం కైవసం చేసుకున్నారు. వారికి వారి కుటుంబానికి ఆయుర్ ఆరోగ్యాలు గణనాథుడు వారిని కుటుంబాన్ని చల్లగా చూడాలని స్థానిక కౌన్సిలర్ శ్రీలత రాంబాబు కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి. కోలాటపాటలు ఆర్కెస్ట్రా ప్రజలను కనువిందు చేసి భక్తి పాటలు పాడుతూ ప్రజలను మమేకమై ఆటల్లో ముంచేసిన కళాకారులు యువకులను ఉత్తేజపరిచే కళారూపాలు ప్రదర్శించి చౌరస్తా యూత్ అసోసియేషన్ ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించి శోభయాత్ర కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వినాయకుడి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సీతారాంపేట్ గ్రామంలో అన్నదాన ప్రభువులు కొంద్రు జయమ్మ, వారి కుమారులు కొంద్రు నాగరాజు, కొంద్రు క్రాంతి కుమార్. వారి చేతుల మీదుగా అన్న ప్రధానం చేశారు కార్యక్రమానికి టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వంశీ కృష్ణారెడ్డి టిఆర్ఎస్ పార్టీ సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా సిఐ మురళి జన్మదిన వేడుకలు



మధిర సెప్టెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు మధిర సిఐ మురళి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన టౌన్ ఎస్ఐ రూరల్ ఎస్సై సి ఐ క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ శాఖ మధిర సీఐ మురళి జన్మదిన వేడుకలు మధిర టౌన్, రూరల్ ఎస్సైలు సతీష్ కుమార్, నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర సర్కిల్ పరిధిలో ప్రజల నుండి పోలీస్ శాఖలో అన్టే సమస్యలు పరిష్కరించే అధికారిగా మంచి పేరు ఉన్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల కేకును మురళి కట్ చేశారు. అనంతరం సిఐ కి వారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ప్రజా ప్రతినిధులు అన్ని పార్టీ నాయకులు సి ఐ మురళి జన్మదిన శుభాకాంక్షలు

## రంగయ్యకు మట్టా దయానంద్ నివాళులు..



తల్లాడ, సెప్టెంబర్ 12 (ప్రజాపాలన న్యూస్): తల్లాడకు చెందిన నన్నపనేని రంగయ్య ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆయన ఆయన దశదిన కర్మ తల్లాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో టిఆర్ఎస్ నాయకులు గణేశుల రవి, తూము నరసింహారావు, తిమ్మినేని ప్రసాదు, దొడ్డ శ్రీనివాసరావు, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ యాకుబ్ పాషా ఉన్నారు.

## ప్రజావాణి సమస్యలకు 151 ఫిర్యాదులు

### జిల్లా రెవిన్యూ అధికారి అశోక్ కుమార్





వికారాబాద్ బ్యూరో 12 సెప్టెంబర్ ప్రజా పాలన : ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈరోజు ప్రజల నుండి వివిధ సమస్యలపై 151 ఫిర్యాదులు అందినట్లు జిల్లా రెవిన్యూ అధికారి అశోక్ కుమార్ తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డిఓ విజయకుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


## పార్టీ బలోపేతానికి కృషిచేయండి



వికారాబాద్ బ్యూరో 12 సెప్టెంబర్ ప్రజా పాలన : వికారాబాద్ జిల్లా నవాబ్ పేట మండలంలో టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని జడ్పి చైర్ పర్సన్ పట్నం సునీతా మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, టీఎస్ ఈడబ్ల్యుఐడీసి మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బందెయ్య గౌడ్, గొల్లగూడ సర్పంచ్ శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు యాసీన్ సునితమ్మను కలిశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ పార్టీ, తాము ఎప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మీరు కూడా పార్టీ బలోపేతానికి మండలంలో కృషిచేయాలని సూచించారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..

## జ్ఞాపకాల కలబోత



**బిఎస్. రాములు**
**సామాజిక వేత్త**
**బిసి కమీషన్ మాజీ చైర్మన్**

అక్కడ్నించి జిల్లా శాఖా గ్రంథాలయానికి వెళ్ళాను. చిన్నప్పుడు చదువుకున్న పుస్తకాలన్నీ తిరగేద్దామనుకున్నాను. లైబ్రేరియన్ ఎటో వెళ్లాడు. పుస్తకాల గదికి తాళం వేసి ఉంది. వరండాలో దినవార పత్రికలు మాత్రమే ఉన్నాయి. కాసేపు అటూ ఇటూ తిరగేసి ఇంటికి వచ్చాను. లైబ్రేరియన్‌కు ఉద్యోగం కన్నా, మిరపకాయల బేరం, చింతపండు బేరం మీద ఎక్కువ శ్రద్ధ. వారానికి రెండుమూడు సార్లు వచ్చిపోతుంటాడని తెలిసింది.

పుర ప్రముఖులైన జిడుగు కిషన్, కొత్త శంకరయ్య, దారం పురుషోత్తం తదితరులను కలవాలనిపించలేదు. 1967లో ఆర్‌ఎస్‌ఎస్ ఓటీసి ట్రైనింగ్‌కు కనీసం 60 రూపాయలు చేయూతనందించలేకపోయారు అని మనస్సులో ఉండింది. ఆనాటి జిల్లా ప్రచారక్ శ్రీధర్‌జీ వారిని అడిగి ఎందుకు ఇప్పించలేదని కూడా కోపంగా ఉండింది.

కొత్త బస్టాండులో దారం పురుషోత్తం పెట్రోల్ బంకు పక్కన టేలా నడుపుతున్న మిత్రుడు నాగయ్యను కలిశాను. అలా చాలామంది ఆర్‌ఎస్‌ఎస్ మిత్రులను, బంధువులను, స్నేహితులను, క్లాస్‌మేట్లను కలిశాను.

***చేనేత సహకార సంఘం - బీడీ కార్మికులు :***

చేనేత సహకార సంఘం ఎలా నడుస్తున్నదో వాకబు చేశాను. రాజకీయ చైతన్యం పెరిగిన క్రమంలో బీడీ కార్మికురాలు కొక్కుల మారుతీ తల్లి కొక్కుల బుచ్చక్క బీడీ కార్మిక నాయకురాలిగా ఎదిగి మున్సిపల్ కౌన్సిలర్ అయింది. జగిత్యాల, సిరిసిల్ల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పద్మశాలీ మహిళలు సర్పంచ్‌లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు అయ్యారు. ఎమ్మెల్యేలు కాలేకపోయారు. బీడీ కార్మిక మహిళలు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లుగా, సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. ఈ చైతన్యాన్ని, పరిణామాలను 'జీవనయానం' నవలలో వివరంగా చిత్రించాను. చేనేత సహకార సంఘాలు క్రమక్రమంగా ఎలా ప్రభావం తగ్గిపోతూ వచ్చాయో, సంఘం కోసం చేసే బదులుగా వ్యక్తిగత లాభం కోసం పనిచేసేవాళ్లవల్ల, మిల్లు బట్టలవల్ల చేనేత సహకార సంఘం ఎలా కుంటుబడిపోతూ వచ్చిందో ఆ నవలలో చిత్రించాను. శ్యామ్ బెనగల్' 1987లో తీసిన 'సుస్మాన్' సినిమాలో కూడా పోచంపల్లి చేనేత నిపుణుల గురించి చిత్రిస్తూ, ఇదే పరిణామం చెప్పారు. షబానా అజ్మీ, ఓంపురి దంపతులుగా నటించిన సినిమా ఇది. హిందీలో తీశారు. పద్మశాలీల జీవితాలగురించి 'సుస్మాన్' మొదటి సినిమా అయితే ఇటీవల వచ్చిన 'మల్లేశం' సినిమా రెండవది అని చెప్పుకోవచ్చు. అయితే 'మల్లీశ్వరి' సినిమాలో ఎన్.టి. రామారావు మేము పద్మశాలీలం అని చెప్తాడు. కానీ ఆయన శిల్పాలు చెక్కుతుంటాడు. చేనేత వృత్తి చూపించలేదు.

* * *

***రషీద్ హొటల్ - గుర్రం నరహరి :***

సాయంత్రం ఆరు అవుతున్నది. రషీద్ హొటల్ నిండా సినిమా టాకీస్ వల్లనే ఫుల్ రష్‌గా ఉంది. నేను, రాజనర్సు, గుర్రం నరహరి, ఆర్ గంగాధర్ కలిసి కొద్దిసేపు నిలబడి ఖాళీ కాగానే అక్కడ కూర్చున్నాము. బజ్జీలు, మిర్చీలు ఆర్డర్ ఇచ్చాము. గిరాకీ బాగా ఉండడంతో సప్లయ్ లేటవుతున్నది.

"గుట్ట రాజరాజేశ్వర స్వామి గుడికి రేపు పోదామా!" అన్నాడు గుర్రం నరహరి.

"సరే పోదాం" అన్నాడు రాజనర్సు.

"మన దేవుళ్ళల్లో శివుడే ప్రాచీన దేవుడు అనుకుంటా తోలును బట్టలుగా కట్టుకుంటడు. మెడలో పాము వేసుకుంటడు. త్రిశూలం పట్టుకుంటడు. శరీరంమీద అంగీ ఉండదు. ఇవన్నీ వెనుకటి ఆటవిక గణతెగల సమాజానికి చిహ్నాలు. అందువల్ల బ్రహ్మ కన్నా, విష్ణువు కన్నా, శివుడే పాత దేవుడు అనుకుంట" అన్నాను. ఈ విషయంపై చాలాసేపు చర్చ జరిగింది. బజ్జీలు వచ్చినయ్, మిర్చీలు వచ్చినయ్, చాయ్ కూడా అయిపోయింది. చర్చ నడుస్తూనే ఉంది. రషీద్ వచ్చి సార్ చాలాసేపు అయింది. ఏమనుకోకండి సార్ అంటూ నిలబడ్డాడు. అటు చూస్తే జనం చాలామంది నిలబడి ఉన్నారు. మాటల్లో ఎంతసేపు అయిందో తెలియదు. బిల్లు కట్టి బయటపడ్డాము. చర్చ సాగుతూనే ఉంది.

"శివుడు నల్లగా ఉంటాడు. ద్రావిడుల పూర్వీకుడేమో" అన్నాను.

"హిమాలయ పర్వతాల్లో సంచరించే శివుడు ద్రావుడు ఎట్లవుతడు?" అన్నాడు రాజనర్సు.

**(మిగతాభాగం రేపటి సంచికలో..)**

## ఇల్లూరులో ఎన్నారై సైదులు ఘనంగా సన్మానించిన శిష్యుడు



మధిర రూరల్ సెప్టెంబర్ 12 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో ఇల్లూరు గ్రామంలో ఎన్నారై సైదులుకు ఘనంగా సన్మానించిన తన శిష్యుడుగా పిలువబడే అధ్యాపకుడుకు ఆయన శిష్యులు నిర్మల్ నుంచి వచ్చి ఘనంగా సన్మానం చేయడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు అధ్యాపకులుగా స్థిరపడినా మంటే ఆయన యొక్క కృషి ఫలితమే అని, నిర్మల్ లో విద్యా సంస్థలు స్థాపించి 20 సంవత్సరాల పాటు అనేక మంది నిరుపేద వెనుక బడిన జాతుల విద్యార్థులను ఉన్నత ఉద్యోగుల గా తీర్చిదిద్దిన ఘనత వారికి దక్కుతుందని అన్నారు, అంత మహోన్నతమైన వ్యక్తిని కలిసి గురుదక్షిణగా సన్మానం చేయాలని భావించి ఇంత దూరం వచ్చి సన్మానించడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమంలో శ్రీనిధి విద్యాసంస్థల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ బి. అంజన బాబు, వారి శిష్యులైన లింగన్న, పోశెట్టి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రక్షిత కౌలుదారులకు రక్షిత కౌలుదారు చట్టం ప్రకారంగా వెంటనే పట్టాలివ్వాలి: యాచారంలో రిలే నిరాహార దీక్ష



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ తేదీ 12 ప్రజాపాలన ప్రతినిధి :నంది వనపర్తి సింగారం తాటి పర్తి కుర్మిద్ద గ్రామాలల్లో రక్షిత కౌలుదార్లు 1400 ఎకరాల భూములు తారతరాల నుండి సాగు చేస్తున్నా భూములకు పట్టాలు ఇయ్యాలని ఈరోజు రిలే నిరాహార దీక్ష యాచారం లో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ప్రారంభించారు.ముందుగా ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాల వేసి నాము అనంతరంబి వెంకట్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు నుండి 4 గ్రామాల రైతులు ఈ భూమిని నమ్ముకొని బావులు తవ్వి బోర్లు వేసి మోటలు కొట్టి భూమిని అభివృద్ధి చేసి సాగుచేస్తు జీవిస్తున్నారు. 1950 సంవత్సరంలో రక్షిత కౌలుదారు చట్టం వచ్చిన తర్వాత 37ఏ సర్టిఫికెట్ ఇచ్చారు 38ఈ సర్టిఫికెట్ ఇయ్యాల్సి ఉండగా. భూస్వాములు రైతుల అమాయ కత్వాన్ని అజ్ఞానాన్ని ఆసరా చేసుకుని దేవుని పేరా రాయడం జరిగింది అప్పటినుండి రైతులను రక్షిత కౌల్దారూలుగా నమోదు చేసి శిస్తులు వసూలు చేసి రైతులను నిలువెల్లున ముంచినారు. ఇది రైతులకు చెందవాల్సిన భూమి రక్షిత కౌలుదారు చట్టం ప్రకారం గా రైతులకు పూర్తి హక్కులు ఉన్నది కాబట్టి. ప్రభుత్వాలను కదిలించే పోరాటాలు పెద్ద ఎత్తున చేసి సాధించుకోవాల్సిన అవసరం వున్నది . ఎన్నోభూ పోరాటాలు చేసి లక్షలాది ఎకరాల భూములు పంచిన ఎర్ర జెండా మీకు అండగా వుంది మీకోసం వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఇతర ప్రజా సంఘాలు మీకు అండగా ఉండి మీకు భూములు వచ్చే వరకు మీకు తోడుగా ఉంటాము హైదరాబాద్ కేంద్రంలో రెవెన్యూ శాఖ మంత్రి ముఖ్యమంత్రికి లేకలు రాసి వారి దృష్టికి తీసుకువెళ్లి ఒత్తిడి చేసే ప్రయత్నం చేస్తాం మీరు పట్టు విడువకుండా పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి అంజయ్య కెవిపిఎస్ జిల్లా నాయకులు ఆలంపల్లి నరసింహ రైతు సంఘం మండల అధ్యక్షులు తావు నాయక్ భూ పోరాట సమన్వయ కమిటీ కార్యదర్శి జోగు రాములు నాయకులు రాజిరెడ్డి బి కృష్ణ జంగయ్య అశోక్ మహేష్ కృష్ణ చెన్నారెడ్డి ఎం రాములు పి జంగయ్య జి యాదయ్య చిత్తరి గోపాల్ సత్తమ్మ పి కృష్ణయ్య యాదయ్య డి యాదయ్య అంజయ్య ముత్యాలు నారయ్య కృష్ణయ్య డి యాదమ్మ చంద్రకళ పార్వతమ్మ సుశీల నవీన్ కుమార్ జంగయ్య రాములమ్మ తదితరులు ఉన్నారు.

## జల్ శక్తి అభియాన్ సెంట్రల్ టీం పర్యటన: వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల




వికారాబాద్ బ్యూరో 12 సెప్టెంబర్ ప్రజా పాలన : జిల్లాలో జల్ శక్తి అభియాన్ సెంట్రల్ టీమ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ నిఖిల అధ్యక్షతన కమిటీ సభ్యులతో కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లాలో డి ఆర్ డి ఏ, ఇరిగేషన్, అటవీ శాఖ,పంచాయతీ రాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ, హరితహారంలో నాటిన మొక్కలు, హరితహారం నర్సరీలు, అవెన్యూ ప్లాంటేషన్, ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, అమృత్ సరోవర్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, ఉపాధి హామీ పనులపై జల్ శక్తి అభియాన్ సభ్యులకు వివరించడం జరిగినది. పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ చూసిన కేంద్రం అధికారులు సంతృప్తి వ్యక్తపరిచారు. ఈరోజు నుండి మూడు రోజుల పాటు జిల్లాలో చేపట్టిన వివిధ పనులను క్షేత్ర స్థాయిలో కేంద్ర సభ్యులు పరిశీలించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లా అధికారులు అందరు చేపట్టిన పనులకు కేంద్ర జల శక్తి అధికారులకు క్షేత్ర స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జల్ శక్తి అభియాన్ డైరెక్టర్ మరియు నోడల్ ఆఫీసర్ రాకేష్ కటారియా, ప్రతాప్ సింగ్ సోలాంకి సైంటిస్ట్, డి ఆర్ డి ఓ కృష్ణన్, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, డీపీవో మల్లారెడ్డి, జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారి దీపా, జిల్లా వైద్య అధికారి పాల్వాన్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక దేవి, ఇరిగేషన్ శాఖ అధికారులు, మున్సిపల్ కమీషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటానికి అసలు సిసలైన వారసులు కమ్యూనిస్టులే

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు**



బోనకల్, సెప్టెంబర్ 12 ప్రజా పాలన ప్రతినిధి: కమ్యూనిస్టుల త్యాగఫలమే తెలంగాణ ప్రాంత విలీనమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిరునోముల గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు తామ్రపత్ర గ్రహీత స్వాతంత్ర సమరయోధులు రావెళ్ల జానకి రామయ్య స్థూపానికి సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్ తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..తెలంగాణ సాయుధ రైతాంగ విమోచన దినం అని కొంత మంది విద్రోహం అని అంటున్నారని, కానీ వాస్తవానికి అది విలీనం అన్నారు. బీజేపీ నాయకులు చరిత్రను వక్రీకరించడం సరికాదని విమర్శిస్తూ తెలంగాణ సాయుధ పోరాటానికి అసలు సిసలైన వారసులు కమ్యూనిస్టులు మాత్రమేనని ఆయన అన్నారు. అసలు తెలంగాణ సాయుధ పోరాటం చేసేనాటికి బిజెపి పార్టీ ఏర్పడలేదని, ఆర్ఎస్ఎస్ ఏర్పడిన సాయుధ పోరాటానికి మద్దతు ఇవ్వలేదన్నారు. అసలు సాయుధ పోరాటంలో పాత్ర లేని నాయకులు ఇప్పుడు విమోచన దినం అనడం చరిత్రను వక్రీకరించడంమేనన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 1945 నుండి 1947 మధ్య కాలంలో సుమారు మూడు వేల గ్రామాలను నిరంకుశ పాలన నుంచి విముక్తి చేసిందన్నారు.ఈ ఉద్యమంలో అనేక మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు అమరులయ్యారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, ఎర్రజెండా తో నిజాం సైన్యాన్ని గడగడలాడించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ ల దేనన్నారు. ఈ పోరాటం వల్ల నాటి తెలంగాణ ప్రాంతంలోని గ్రామాలన్నీ కమ్యూనిస్టుల చేతుల్లోనే వచ్చాయని, పేద ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచడం జరిగిందని, ఒక హైదరాబాదు నగరం తప్ప మిగిలిన ప్రాంతం అంతా కమ్యూనిస్టుల చేతుల్లోనే ఉందని, హైదరాబాద్ స్టేట్ కమ్యూనిస్టుల వస్తే ఏమవుతుంది అని తెలుసుకున్న నాటి కాంగ్రెస్ 1948 సెప్టెంబర్ 17న నిజం సైన్యంను పంపి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఈ చరిత్రను ప్రస్తుత యువత తెలుసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల నాయకులు మాతంగి శ్రీనివాసరావు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కొరకు ఆర్టీసీ బస్సులను నడపాలి: మండల యూత్ కాంగ్రెస్ డిమాండ్



మధిర సెప్టెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నాడు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కొరకు ఆర్టీసీ బస్సులు నడపాలిమధిర ఎరుపాలెం మండలాల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థుల కొరకు ఉదయం సాయంత్రం బస్సు లేని రోడ్లలో బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ మధిర బస్ డిపో ఎదుట నిరసన ధర్నాను విద్యార్థినీ విద్యార్థులతో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్ మాట్లాడుతూ మధిర రామన్నపాలెం ఎర్రుపాలెం మీదుగా గతంలో బస్సు నడిచేది ఆ బస్సును క్యాన్సిల్ చేయడం వల్ల ఆ రూట్లో నుండి ప్రయాణించే విద్యార్థిని విద్యార్థులు ప్రయాణ సౌకర్యాలు లేక సరైన సమయంలో కళాశాలకు వెళ్లి చదువుకోలేక అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారు అలాగే మధిర ఎర్రుపాలెం గట్ల గౌరవరం వరకు బస్ నడపాలని, మధిర నుండి చిలుకూరు వరకు విద్యార్థుల కొరకు బస్సులు నడపాలని, ఈ సందర్భంగా మధిర డిపో మేనేజర్ దేవదానం గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. అలాగే ఈ విషయంపై మధిర శాసనసభ్యులు సీఎల్పీ నేత లిమల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకు వెళుతున్నట్లు త్వరలోనే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే కృషీ చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్దార్ జమలాపురం కేశవరావు కళాశాల ప్రిన్సిపాల్ శ్యాం ప్రసాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు సురేష్ సిద్దు తమ్మిసెట్టి కిరణ్ ఎస్ఎఫ్ఐ నాయకులు వడ్రానపు మధు నంద్రు శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## పేదల అభ్యున్నతే ఎమ్మెల్యే మంచిరెడ్డి లక్ష్యం




ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ తేదీ 12 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ (500) మరియు ముకునూరు (167) గ్రామంలో ఆసరా పింఛన్ల లబ్ధిదారులకు కార్డుల పంపిణీ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎంపీపీ పి.కృపేష్ ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల టిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి గంగిరెడ్డి భాస్కర్ రెడ్డి,సర్పంచ్లు బల్వంత్ రెడ్డి,శివరాల జ్యోతిరాజు, ఎంపీటీసీ1 అచ్చన శ్రీశైలం,ఎంపీటీసీ2 జ్యోతి,కోపరేట్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఈశ్వర్,ఉపసర్పంచ్ బాలరాజు,గ్రామశాఖ అధ్యక్షులు డొంకని బాలు గౌడ్,గ్రామ శాఖ అధ్యక్షులు జి శ్రీనివాస్, నరసింహ,సుధాకర్ గౌడ్, శ్రీధర్,నరసింహ గౌడ్,జంగారెడ్డి,నర్సింగ్ రావ్,సురేందర్, సంజీవమండల యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సన్నాయిల ప్రేమ్ వాడు మెంబర్ కిరణ్ మాజీ అధ్యక్షులు జి వెంకటేష్ మాజీ వార్డ్ మెంబర్ పి ప్రభాకర్ మరియు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా: మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి



మధిర సెప్టెంబర్ 12 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో సోమవారం నాడు మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి పలువురు పరామర్శ లో భాగంగా మధిరలో విలేకరుల సమావేశంలోనూ పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ముందుగా ఏ ఎన్నికలు జరిగినా ఆ ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేస్తానని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో డాక్టర్ కోటా రాంబాబు నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా తాను పోటీలో ఉంటానని ఆయన అన్నారు. టిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానన్నారు. జిల్లాలో పాదయాత్ర చేసే అవకాశం ఉందా అని విలేకరుల ప్రశ్నించగా, నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నారని, అధికార పార్టీలో ఉండి పాదయాత్ర చేయటం సమంజసం కాదన్నారు ఆయన తెలిపారు మండలం పరిధిలో పలువురు ఇంటికి వెళ్లి పరామర్శలు చేసి నేను ఉన్న మీ వెంట మీఅండగా ఉంటారని ఉత్సాహంగా అందరిని పలకరిస్తూ మనోధైర్యం తెలిపారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కె వి ఆర్ హాస్పిటల్ అధినేత కోట రాంబాబు అప్పారావు రమేష్ చావల్ రామరాజు దేవి శెట్టి రంగా లక్ష్మారెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు వార్డ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు



## ట్రోలర్ల నోళ్లు మూయించిన బన్నీ..!



కేంద్ర మాజీ మంత్రి సీనియర్ నటుడు రెబల్ స్టార్ కృష్ణంరాజు మరణంతో ఇండస్ట్రీలో తీవ్రవిషాదం నెలకొంది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణంరాజు.. ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల సినీ రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియాలో తమ సంతాపం వ్యక్తం చేశారు. అలానే ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కృష్ణ – చిరంజీవి – మోహన్ బాబు – మహేష్ బాబు – పవన్ కళ్యాణ్ – ఎన్టీఆర్ వంటి స్టార్స్ ట్విట్టర్ వేదికగా సంతాపం ప్రకటించడమే కాదు.. జూబ్లీ హిల్స్ లోని కృష్ణంరాజు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. అయితే అల్లు అర్జున్ మాత్రం కృష్ణంరాజు మరణంపై ట్వీట్ చేయకుండా.. తనకు సైమా అవార్డ్ దక్కడం పై పోస్ట్ పెట్టడంపై ట్రోల్స్ వచ్చాయి. సైమా అవార్డ్స్ అందుకున్న మిగతా నటీనటులంతా సీనియర్ నటుడి మరణ వార్త విని తమ అవార్డుల గురించి ట్వీట్ చేయలేదు.. కానీ బన్నీ ఎందుకు ఇలా చేసాడు అని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చించుకున్నారు. రియల్ లైఫ్ లో ప్రభాస్ మరియు బన్నీ మంచి ఫ్రెండ్స్ గా ఉంటారు. అలాంటిది ఆయన పెదనాన్న మృతిపై సంతాపం ప్రకటించకుండా.. తన అవార్డ్ గురించి పేర్కొందమేంటని ఓ వర్గం నెటిజన్లు అల్లు అర్జున్ పై మండిపడ్డారు. సైమా కోసం బెంగుళూరు వెళ్లిన విజయ్ దేవరకొండ – నవీన్ పొలిశెట్టి లాంటి హీరోలు కూడా హైదరాబాద్ వచ్చి కృష్ణంరాజు పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తే.. అల్లు అర్జున్ మాత్రం ట్వీట్ కూడా పెట్టలేకపోయాడని విమర్శించారు. అయితే బన్నీ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించడమే కాదు.. ఇంటికి వెళ్లి నివాళులు అర్పించారు.

## కాలేజ్ కెళ్లే పాపాయిలా పరవశంలో అనుష్క



అనుష్క శర్మ సంతోషకరమైన క్షణాలను ఆస్వాధిస్తోంది. తరచుగా సోషల్ మీడియా పోస్ట్ లు దీనిని ఆధారం. తదుపరి కొంత గ్యాప్ తర్వాత తాను నటించిన తాజా చిత్రం చక్దా ఎక్స్ప్రెస్ ప్రమోషన్స్ కోసం సిద్ధమవుతోంది. అయితే ఇలాంటి బిజీ సమయంలోనూ అనుష్క శర్మ సామాజిక మాధ్యమాల వేదికగా ఫ్యాన్స్ కి టచ్ లో ఉంటోంది. ఆమె అక్కడ తన అనుభవాలతో పాటు ఇతర వినోదం పంచే విషయాలను కూడా షేర్ చేస్తోంది. కొద్దిసేపటి క్రితం తన ఇన్ స్టాలో కుమార్తె వామికతో కలిసి ఆమె సందర్శించిన పార్క్ నుండి ఓ ఫోటోని పంచుకుంది. ఆ ఫోటోల్లో ఒక స్కూల్ పాపాయిలా ఎంతో ఆస్వాధిస్తూ కనిపించింది. కూతురు వామికతో కలిసి ఒక పార్కులో ఇలా కనిపించగా అది చూపరులను ఆకట్టుకుంది. ఈ ఫోటోల్లో ఒక పార్క్ లో తన సమయాన్ని ఆస్వాదిస్తూ ఉల్లాసంగా నవ్వుతూ కనిపిస్తుంది. సింపుల్ గా క్యాజువల్స్ ధరించి రిఫ్రెష్ లుక్ తో కనిపించింది. షేడెడ్ లేత-నీలం డెనిమ్ ప్యాంటు తెల్లటి టీ-షర్ట్ ధరించి కనిపించింది. నేను మా కూతుర్ని తీసుకెళ్లిన ప్లే పార్క్ ఇది (నవ్వుతూ ఎమోజి) అని అందమైన వ్యాఖ్యను జోడించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే..చక్దా ఎక్స్ ప్రెస్ చిత్రంలో భారత మాజీ మహిళా క్రికెటర్ ఝులన్ గోస్వామి పాత్రలో కనిపించనుంది. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించారు. 2012లో పద్మశ్రీ అందుకున్న రెండవ భారతీయ మహిళా క్రికెటర్ అయిన ఝులన్ గోస్వామి జీవితం ఆధారంగా ఈ సినిమాని రూపొందించారు. నాలుగేళ్ల తర్వాత అనుష్క మళ్లీ నటిస్తోంది. ఆమె చివరిగా 2018లో జీరో చిత్రంలో షారుఖ్ ఖాన్ – కత్రినా కైఫ్ లతో కలిసి కనిపించింది.

## వీరయ్య కోసం వెంకటేష్‌ని దించేస్తున్నారా?




మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా 154వ చిత్రంగా బాబి దర్శకత్వంలో 'వాల్తేరు వీరయ్య' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. సినిమా టైటిల్ ని బట్టే మాస్ కంటెంట్ తో తెరకెక్కతోన్న చిత్రంగా తెలుస్తోంది. చిరంజీవి పాత్ర ఆద్యంతం ఊర మాస్ గా మలుస్తున్నారు. బాబి మాస్ అభిమానాన్ని మొత్తం రంగరించి చిరు పాత్రని డిజైన్ చేసారు. తన అభిమానమంతా తెరపై కనిపించనుంది. వైజాగ్ వాల్తేర్ నేపథ్యంలో సాగే స్టోరీలో ఇంకా కొన్ని బలమైన పాత్రలు సైతం కనిపిస్తున్నాయి. ఇప్పటికే చిరంజీవి సోదరుడి పాత్రలో మాస్ రాజా రవితేజ నటిస్తున్నారు. ఆ రెండు పాత్రలత మధ్య బలమైన ఎమోషన్ సన్నివేశాలుంటాయని తెలుస్తోంది. రవితేజ తెరపై కనిపించేది కాసేపే అయినా ఉన్నంతసేపు ఓ ఊపు ఊపేసి వెళ్లిపోయేలా పాత్ర ఉంటుందని టాక్. వీరయ్య సవతి తల్లి కుమారుడి పాత్రలో రవితేజ ఆద్యంతం మెప్పిస్తారని టీమ్ ధీమా వ్యక్తం చేస్తుంది. చిరంజీవి మాస్ రోల్ కి ధీటుగానే ఆ పాత్రని తీర్చి దిద్దుతున్నట్లు సమాచారం. అలా రవితేజ ఎంట్రీతోనే వీరయ్య సినిమాపై ఊపు రెట్టింపు అయింది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకి సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ ఒకటి వైరల్ గా మారింది. క్లైమాక్స్ లో విక్టరీ వెంకటేష్ కూడా నటిస్తున్నారుట. గెస్ట్ అప్పీరియన్స్ రోల్ కి వెంకీని ఒప్పించినట్లు సమాచారం. మరి ఇందులో వాస్తవం తెలియాల్సి ఉంది. ఇదే నిజమైతే వీరయ్యకి అదనపు అడ్వాంటేజ్ గా కలిసొస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే చిరంజీవి-రవితేజ లాంటి స్టార్లు భాగమయ్యారు. వాళ్లిద్దరికి తోడుగా వెంకీ కూడా రంగంలోకి దిగితే బొమ్మ దద్దరిల్లిపోదు. ముగ్గరు హీరోలకు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. కోట్లాది మంది అభిమానులున్నారు. అలాంటిది ముగ్గురు ఒకే తెరపై కనిపిస్తే సన్నివేశం ఎలా ఉంటుందన్నది మాటల్లో చెప్పలేనిది. సినిమా బిజినెస్ పీక్స్ లో ఉంటుంది. మెగాస్టార్ ఇమేజ్ తోనే కోట్ల వర్షం కురుస్తుంది. రవితేజ...వెంకీ స్టార్ డమ్ కూడా తోడైతే రెట్టింపు బిజినెస్ కి ఛాన్స్ ఉంది. అలాగే చిరంజీవి నటిస్తోన్న మరో సినిమా 'గాడ్ ఫాదర్' లో బాలీవుడ్ లో హీరో సల్మాన్ ఖాన్ నటిస్తోన్న సంగతి తెలిసిందే. సల్మాన్ గెస్ట్ అప్పీరియన్స్ తో గాడ్ ఫాదర్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. మరి ఈ లెక్కలన్నీ బేరీజు వేసి చూస్తే వెంకటేష్ మెగాస్టార్ కోసం వ్యాకప్ వేసుకున్నా? పెద్దగా ఆశ్చర్యపోనవసరం లేదు.

## కార్తికేయ 2 ని తలపిస్తున్న శర్వా 'ఒకే ఒక జీవితం'..!



నిఖిల్ హీరోగా నటించిన కార్తికేయ 2 సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీలో ఈ సినిమాను విడుదల చేసిన విషయం తెల్సిందే. కార్తికేయ 2 సినిమా అనూహ్యంగా హిందీలో మెల్ల మెల్లగా పుంజుకుని భారీ విజయం ను సొంతం చేసుకుంది. ఇప్పుడు అదే తరహాలో ఒకే ఒక జీవితం సినిమాకు సంబంధించిన తమిళనాట వసూళ్లు పెరుగుతూ ఉన్నాయని టాక్ వినిపిస్తుంది. శర్వానంద్ హీరోగా రీతూ వర్మ హీరోయిన్ గా రూపొందిన ఒకే ఒక్క జీవితం సినిమాను తమిళంలో కణం పేరుతో విడుదల చేయడం జరిగింది. మొదటి రోజు సినిమాను జనాలు పట్టించుకోలేదు. కానీ మౌత్ టాక్ తో మెల్ల మెల్లగా వసూళ్లు పెరిగాయి. వీకెండ్ లో సినిమాకు మంచి స్పందన దక్కింది. శర్వానంద్ సినిమా తమిళం లో సక్సెస్ అయ్యి చాలా సంవత్సరాలు అయ్యింది. మళ్లీ ఇన్నాళ్లకు తమిళనాట శర్వాకు ఈ సినిమా తో సక్సెస్ దక్కిందని బాక్సాఫీస్ వర్గాల వారు అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో శని మరియు ఆది వారాల్లో ఒకే ఒక జీవితం సినిమాకు మెజార్టీ స్థాయి వసూళ్లు నమోదు అయ్యాయి. దాదాపుగా 85 శాతం ఆక్యుపెన్సీ నమోదు అయినట్లుగా తెలుస్తోంది. పదుల సంఖ్యలో థియేటర్లలో హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి. తమిళనాట కూడా ఈ సినిమా కణంగా ఆకట్టుకుంటుంది. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా లో అక్కినేని అమల కీలక పాత్రలో నటించిన విషయం తెల్సిందే. సినిమాకు సంబంధించిన టాక్ పాజిటివ్ గా ఉండటం తో వీక్ డేస్ లో అంటే నేటి నుండి వసూళ్లు ఎలా ఉంటాయా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వీక్ డేస్ లో స్ట్రాంగ్ గా వసూళు ఉంటే సాలిడ్ ప్రాఫిట్స్ ఖాయం.

## 'లైగర్' పంచాయతీ ఛాంబర్ కి చేరిందా?



సినిమా రిలీజ్ అయి హిట్ అయితే అంతా హ్యాపీ. లేదంటే? అన్ని సమస్యలే. డబ్బు చుట్టూ నడిచే ప్రపంచంలో ఇదంతా సహజమే. నష్టపోయిన నిర్మాత నుంచి పంపిణీదారుడు..బయ్యర్ ప్రతీ ఒక్కరూ లబోదిబో మనక తప్పదు. నష్టం లక్షల్లో ఉన్నా..కోట్లలో ఉన్నా? ఆ సమస్యలు తొలగిపోయే వరకూ అంతా భారంగానే కనిపిస్తుంది. ఆ మధ్య రిలీజ్ అయిన ఆచార్య ఇలాంటి సమస్యనే ఎదుర్కొంది. విషయం సీరియస్ కాకుండానే మెల్లగా ఎలాగూ బయ్యర్లకు కార్యాలయంలో సెటిల్ చేసి పంపించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సినిమా వైఫల్యం చెందితే ఫలితం ఎలా? ఉంటుందన్నది దర్శకుడు కొరటాల శివకి తొలిసారి అర్ధమైంది. ప్రస్తుతం లైగర్ విషయంలో కూడా అలాంటి సన్నివేశమే కనిపిస్తుంది. ఇటీవల భారీ అంచనాల మధ్య లైగర్ ప్రేక్షకుల ముందుకొచ్చి వాటిని అందుకోవడంలో విఫలమైన సంగతి తెలిసిందే. పూరి బ్రాండే కావొచ్చు..దేవరొండ ఇమేజ్ నే కావొచ్చు. కారణాలేవైనా బయ్యర్లు మాత్రం తీవ్రమైన నష్టాలు ఎదుర్కున్నారు. దీంతో వివిధ కేంద్రాల్లో పెద్దమొత్తంలో నష్టపోయిన బయ్యర్లు నష్టాన్ని పూడ్చుకునేందుకు ఛార్మిని ఆశ్రయిస్తున్నట్లు మీడియా లో కథనాలొస్తున్న సంగతి తెలిసిందే. నష్టాల్ని పూరించే బాధ్యత సైతం పూరి-చార్మి తీసు కుంటున్నారని కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఆ తర్వాతే తాము కూడా చాలా నష్టపోయామని.. తిరిగి చెల్లించేందుకు చేతిలో చిల్లి గవ్వ కూడా లేదని తమ బాధ్యని సైతం వ్యక్తం చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. పూరి-చార్మితో సన్నిహితంగా ఉండేవారు తమ సమస్యని విన్నవించుకోగా..వాళ్లకి ఈ రోజు కాకపోయినా తర్వాతైనా పరిష్కారం చూపించే ఛాన్స్ ఉందని..మిగతా వారి పరిస్థితి ఏంటి? అని మరో డౌట్ కూడా రెయిజ్ అయింది. ఈ నేపథ్యంలో బయ్యర్లు అంతా ఒకేతాటిపైకి వచ్చినట్లు వినిపిస్తుంది. సెడెడ్ బయ్యర్లు సహా అంతా హైదరాబాద్ లోని పూరీ జగన్నాథ్ కార్యాలయంలో కూర్చొని సెటిల్ చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు గుస గుస వినిపిస్తుంది. మరోవైపు ఒక వార్త ప్రకారం పూరి కనెక్ట్స్ కార్యాలయం ఎలాంటి పరిహారం చెల్లించడానికి సిద్దంగా లేదని వినిపిస్తుంది. దీంతో సమస్య ఫిలిం ఛాంబర్ వరకు వెళ్లిందని తాజా సమాచారం. పూరి కనెక్ట్స్ బ్యానర్ తమ తదుపరి చిత్రం విడుదలకు వ్యతిరేకంగా వడ్డీతో పాటు పెండింగ్ మొత్తాన్ని చెల్లించేలా ఛాంబర్పై ఒత్తిడి తీసుకురావాలని బయ్యర్లు ప్లాన్ చేస్తున్నట్లు ఫిలిం సర్కిల్స్ లో టాక్ వినిపిస్తుంది. దీనిపై అధికారికంగా పూరి కార్యాలయం నుంచిగానీ...బయ్యర్ల నుంచి గానీ ఎలాంటి సమాచారం లేదు.

## విజయ్ వరిసు నాన్ థియేట్రికల్ రైట్స్ భారీ ధరకు!




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ యొక్క వరిసు షూటింగ్ అక్టోబర్ నాటికి పూర్తి కానుంది. ఈ చిత్రం పై సౌత్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ చిత్రం కి సంబంధించిన నాన్ థియేట్రికల్ రైట్స్ విషయం పై లేటెస్ట్ అప్డేట్ ఉంది. ఈ సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్ ద్వారా ఏకంగా 120 కోట్ల రూపాయలు రాబట్టిందన్న మాట. దీని ప్రకారం, డిజిటల్ హక్కులను ప్రైమ్ వీడియో 60 కోట్లకు కొనుగోలు చేసింది. మరియు శాటిలైట్ హక్కులను సన్ నెట్‌వర్క్‌కు దాదాపు 50 కోట్లకు విక్రయించింది. ఆడియో రైట్స్‌కి దాదాపు 10 కోట్ల బిజినెస్ జరిగింది. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ సరసన హీరోయిన్ గా రష్మిక మందన్న నటిస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు బ్యాంక్రోల్ చేయగా, మ్యూజికల్ సెన్సేషన్ థమన్ సంగీతం అందిస్తున్నారు.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989